జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 5 సంచిక 129 | హైదరాబాద్, మార్చి 01 మంగళవారం 2022 | 8 పేజీలు | వెల : 5.00

### రష్యా - ఉక్రెయిన్ మధ్య..
# ఫలించని చర్చలు



ఉక్రెయిన్ : రష్యా – ఉక్రెయిన్ మధ్య శాంతి చర్చలు విఫలమయ్యాయి. బెలారస్ సరిహద్దులోని గోమెల్‌లో ఇరు దేశాల ప్రతినిధులు దాదాపు 4 గంటల పాటు చర్చలు జరిపినా ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. షరతులు, డిమాండ్ల విషయంలో ఇరు దేశాల మధ్య ప్రతిష్టంభన నెలకొన్నట్లు సమాచారం. వెంటనే కాల్పుల విరమణ చేయాలని, డాన్ బాస్ నుంచి రష్యా సైన్యం వైదొలగాలని ఉక్రెయిన్ డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు అమెరికా నేతృత్వంలోని నాటో కూటమిలో చేరబోమని ఉక్రెయిన్ లిఖితపూర్వకంగా రాసివ్వాలని రష్యా డిమాండ్ చేసింది. అలా చేస్తేనే సైన్యాన్ని ఉపసంహరిస్తామని చెప్పినట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్ మాత్రం నాటో కూటమిలో చేరే విషయంలో వెనక్కి తగ్గేందుకు నిరాకరించినట్లు సమాచారం. తక్షణమే సైనిక చర్యను విరమించుకొని, బలగాలను ఉపసంహరించుకోవాలని ఉక్రెయిన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. క్రిమియా నుంచి కూడా రష్యా సైనిక బలగాలను ఉపసంహరించాలని ఉక్రెయిన్ పట్టుబట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి.

## ఉక్రెయిన్ ప్రకటనల్లో నిజం లేదు, రష్యా కంటే ఉక్రెయిన్‌కే నష్టం అధికం : జనరల్ ఇగోర్



రష్యాపై దాడి విషయంలో జరిగిన ప్రాణ, ఆస్తి నష్టాన్ని ఉక్రెయిన్ ప్రకటించిన నేపథ్యంలో రష్యా.. రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మేజర్ జనరల్ ఇగోర్ కీలక ప్రకటన చేశారు. ఉక్రెయిన్ ప్రకటించిన ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన లెక్కలను ఖండించారు. ఉక్రెయిన్‌లో భారీ ఆస్తి, ప్రాణ నష్టం సంభించినట్టు వివరించారు. ఉక్రెయిన్‌తో పాటు రష్య ఆర్మీ కూడా ప్రాణాలు కోల్పయిదని, గాయాలపాలైందని తెలిపారు. ఉక్రెయిన్‌తో పోలిస్తే.. తీవ్రత చాలా రెట్లు తక్కువ అని చెప్పుకొచ్చారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి రష్యా సైన్యం.. ఉక్రెయిన్‌కు సంబంధించిన 27 కమాండ్ పోస్టులు, కమ్యూనికేషన్ కేంద్రాలు, 38 ఎయిర్ డిఫెన్స్ క్షిపణి వ్యవస్థలను ధ్వంసం చేసిందన్నారు. అలాగే 56 రాడార్ స్టేషన్లతో పాటు 1067 ఉక్రెయిన్ సైనికులను హతమార్చిందని రక్షణ మంత్రిత శాఖ ప్రతినిధి మేజర్ జనరల్ ఇగోర్ కొనాషెంకోవ్ ప్రకటించారు. ఉక్రెయిన్ వాదనలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఉక్రెయిన్ చెబుతున్నంత రష్యన్ ఆర్మీ చనిపోలేదన్నారు.

## ఆయుధాలు వీడి వెళ్లిపోండి..

### రష్యన్ సైన్యానికి జెలెన్ స్కీ వార్నింగ్



రష్యా చేస్తున్న దాడుల్లో ఇప్పటి వరకు 16 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని, మరో 45 మంది తీవ్రంగా గాయపడినట్టు జెలెన్ స్కీ వెల్లడించారు. వారందరినీ ఉక్రెయిన్ హీరోలుగా ఆయన అభివర్ణించారు. తమపై దురాక్రమణకు పాల్పడుతున్న రష్యా సైన్యం వెంటనే.. ఆయుధాలు వీడాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు సూచించారు. ఆయుధాలు వదిలిపెట్టి ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. మీ కమాండర్లను నమ్మవద్దని, అసత్యాలను చెప్పే మీ నాయకులనూ నమ్మొద్దని సూచించారు. మీ ప్రాణాలు రక్షించుకోవాలంటూ చెప్పుకొచ్చారు. ఇప్పటికే 5వేల మందికి పైగా రష్యన్ ఆర్మీ ప్రాణాలు కోల్పోయిందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. తామేంటో.. ప్రపంచానికి ఉక్రెయినియన్లు చూపించారన్నారు. ఆ తరువాతి పర్యవసానాలు కూడా ఎలా ఉంటాయో.. రష్యాకు తెలిసి వస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు పేర్కొన్నారు. పశ్చిమ దేశాలకు తమకు మద్దతు ఇస్తున్నాయని, ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు ప్రకటించారు. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు ప్రారంభమయ్యే కొద్దిసేపటి ముందు జెలెన్ స్కీ ఈ వీడియో సందేశాన్ని విడుదల చేశారు.

# ఢిల్లీకి బయల్దేరిన కేసీఆర్



హైదరాబాద్ : తెలంగాణ సీఎం కేసీఆర్ ఢిల్లీకి బయల్దేరారు. నేడు బేగంపేట విమానాశ్రయం నుంచి స్పెషల్ ఫ్లైట్‌లో ఢిల్లీకి పయనమయ్యారు. 3 రోజులపాటు సీఎం కేసీఆర్అక్కడే ఉంటారని తెలుస్తోంది. మంగళవారం ఉదయం సీఎం కేసీఆర్.. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను కలుస్తారని తెలుస్తోంది. ఈమేరకు ఆయనతో ఓ సమావేశం కూడా ఏర్పాటు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఆ తర్వాత ఢిల్లీ ఎయిమ్స్‌ను సందర్శించి హెల్త్ టెస్టులు చేయించుకోనున్నారు. అయితే, దేశ రాజకీయాల్లో కీలక పాత్ర చేపట్టేందుకు పూర్తి స్కెచ్‌తో కేసీఆర్ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఇతర రాష్ట్రాల నేతలతో కీలక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగానే ఢిల్లీ సీఎంతోనూ సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పటికే.. ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రేను కలిసిన సంగతి తెలిసిందే. అలాగే సినిమా నటుడు ప్రకాశ్ రాజ్‌ను కూడా కలిశారు. ఈమేరకు భాజపాకు వ్యతిరేకంగా మద్దతు ఇవ్వాలని కోరారు. అలాగే అనేక లోకల్ పార్టీల నాయకులతోనూ పలు దఫాలుగా సమావేశాలు నిర్వహిస్తామని సీఎం కేసీఆర్ పేర్కొన్న సంగతి తెలిసిందే.కేంద్ర మంత్రులతోనూ సమావేశం.. సీఎం కేసీఆర్ 3 రోజుల పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులను కలవనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర విభజన హామీలతోపాటు పలు సమస్యలు, అలాగే తెలంగాణకు రావాల్సిన నిధులపై మాట్లాడనున్నట్లు తెలుస్తోంది. అయితే, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో భేటీ అవుతారా లేదా అనే విషయం తెలియాల్సి ఉంది.

### బహుజన స్ఫూర్తిని అందించేందుకే..
# ప్రశ్న మాది.. లక్ష మీది కార్యక్రమం
### అంబేద్కర్ టీవీ చైర్మన్ డాక్టర్ కె.శివభాగ్యరావు



విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ప్రజాపాలన బ్యూరో ) :బహుజన మహనీయుల సామాజిక స్ఫూర్తి ని, ఆశయాలను ప్రజలకు అం దించే లక్ష్యం తో మీలో ఎవరు లెజెండ్ బహుజన్? ప్రశ్న మాది.. లక్ష మీది. అనే సరికొత్త ప్రోగ్రాం ను ఏప్రిల్ 14న హైదరాబాద్ లో ప్రారంభిస్తున్నామని (మిగతా 2లో..)

# గవర్నర్ ప్రసంగం లేకుండానే బడ్జెట్ సమావేశాలు..!



హైదరాబాద్: తెలంగాణ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. మునుపెన్నడూ లేని విధంగా ఈ సారి బడ్జెట్ సమావేశాలు నిర్వహించనుంది. గవర్నర్ ప్రసంగం లేకుండానే బడ్జెట్ సమావేశాల నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మార్చి 7వ తేదీ నుంచి రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయని ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం ఆ మేరకు అసెంబ్లీ సమావేశాల షెడ్యూల్‌ను ప్రకటించింది. అయితే, ఈ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం ఉండబోదని, సీఎం కేసీఆర్ ఆమేరకు నిర్ణయం తీసుకున్నారని అధికారవర్గాల సమాచారం. కాగా, రాష్ట్ర బడ్జెట్‌కు ఆమోదం తెలిపేందుకు మార్చి 6వ తేదీన సాయంత్రం 5 గంటలకు ప్రగతి భవన్‌లో రాష్ట్ర కేబినెట్ సమావేశం జరుగనుంది. మార్చి7వ తేదీ నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అవుతాయి. సమావేశాల్లో భాగంగా విధిగా వస్తున్న గవర్నర్ ప్రసంగం ఉండబోదని, నేరుగా రాష్ట్ర ఆర్థిక శాఖ (మిగతా 2లో..)

# వేద మంత్ర పఠనంతో శోభిల్లుతున్న శ్రీశైలం..

కర్నూలు,: శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు కనులపండువలా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు సోమవారం ఆది దంపతులు గజవాహన సేవలో ఊరేగారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కోలాటం, చెక్కభజన, రాజభటులు వేషాలు, జాంజ్ పథక్ , జానపద పగటి వేషాలు , గొరవనృత్యం , బుట్టబొమ్మలు , తప్పెటచిందు బీరప్పడోలు , చెంచునృత్యం , నందికోలసేవ , ఢమరుకం,చితడలు, శంఖం , పిల్లన్నగ్రోవి తదితర కళారూపాలు ఆకట్టుకున్నాయి. రథ శిఖర కలశానికి పూజాదికాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మార్చి 2 వ తేదీన రథోత్సవం నిర్వహించనున్నారు . ఈ సందర్భంగా సోమవారం రథ శిఖర కలశానికి ఆలయములో పూజలు నిర్వహించారు. (మిగతా 2లో..)

## వేములవాడలో శివరాత్రి శోభ..



## ఆర్టీఏ ఆఫీసు ముందు ఆటో డ్రైవర్ల ధర్నా




హైదరాబాద్: ఇతర జిల్లాలకు చెందిన ఆటోలను కూడా హైదరాబాద్ లో తిరిగేందుకు అనుమతి ఇవ్వాలని నిరసన వ్యక్తం చేశారు ఆటో డ్రైవర్లు. ఖైరతాబాద్ లోని ప్రధాన ఆర్టీఏ కార్యాలయం వద్ద 200 మందికి పైగా ఆటో డ్రైవర్లు ధర్నా చేశారు. తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్ కి వ్యతిరేకంగా నినాదాలు చేసిన ఆటో డ్రైవర్లు.. ఆర్టీఏ అధికారులు, పోలీసుల వేధింపులతో పూట గడవని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోవాలా ధర్నాతో పంజాగుట్ట, ఖైరతాబాద్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయ్యింది. జాతీయ ఆదివాసి నాయకుడు కిషన్ నాయక్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టిన ఆటో డ్రైవర్లు.. అనంతరం ఆర్టీవో రామచంద్రయ్యకు వినతిపత్రం అందించారు. ఆటో డ్రైవర్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీఏ అధికారులు 15 రోజులపాటు హైదరాబాద్ లోకి అనుమతి ఇవ్వడంతో నిరసనను విరమించారు. ఇక నుంచి హైదరాబాద్ కు సంబంధించిన రిజిస్ట్రేషన్ నెంబర్ ఆటోలు మాత్రమే సిటీలో నడపాలనే రూల్ ను పూర్తిగా వెనక్కి తీసుకోవాలని కోరారు ఆటో డ్రైవర్లు.

# దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు అరెస్ట్



ఘట్కేసర్: బీజేపీ తలపెట్టిన ధర్నాకి వెళ్తున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావును మార్గమధ్యమంలోనే అడ్డుకున్న పోలీసులు.. అనంతరం ఆయన్ని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. గోరక్షణ కోసం పాటుపడుతున్న హిందూ సంఘాల నాయకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ బీజేపీ కర్మాన్?ఘాట్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావును.. అనుమతి లేదంటూ వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి తన సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలోనే పోలీసులకు, ఎమ్మెల్యే రఘునందన్ రావుకు మధ్య కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం ఆయన వాహనంలోనే ఎమ్మెల్యే రఘునందన్ రావును అరెస్ట్ చేసి ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.



## వేద మంత్ర పఠనంతో శోభిల్లుతున్నశ్రీశైలం..

(మొదటి పేజీ తరువాయి)

వేదమంత్రాలతో పూజలు

నవాహ్నిక దీక్షతో 11 రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఏడో రోజు ఉదయం స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు చేశారు. యాగశాలలో చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జపాలు, పారాయణలు, మండపారాధనలు, పంచావరణార్చనలు, శివపంచాక్షరి, నిత్యహవనాలు, రుద్రహోమం, చండీహోమం వంటి పూజలను ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించారు.

**వేములవాడలో శివరాత్రి శోభ..**

మహా శివరాత్రి సంబరాలకు ప్రసిద్ధ శైవక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే వేడుకలకు సుమారు 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. 3 లక్షల లడ్డూ ప్రసాదాలను సిద్ధంగా ఉంచారు. జాతరకు 770 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు. తిప్పాపూర్ నుంచి కట్ట బస్టాప్ వరకు 14 ఉచిత బస్సులను నడపనున్నారు. విద్యుద్దీపకాంతులతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికతకు అద్దం పట్టేలా వేడుకలను నిర్వహించనున్నారు. గుడి చెరువులో శివార్చన కార్యక్రమ నిర్వహణకు వేదిక సిద్ధం చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలోని భక్తులకు తాగు నీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. శివరాత్రి సంబరాల నేపథ్యంలో ఆలయ అధికారులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాలు, స్థానిక నాంపల్లి గుట్టపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని కూడళ్లలోనూ కెమెరాలు అమర్చారు. వీటన్నింటిని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు. జాతరలో బందోబస్తు నిర్వహించేందుకు 1500 మంది పోలీసులను నియమించారు. ఒక అడిషినల్ ఎస్పీ, 8 మంది డీఎస్పీలు, 30 మంది సీఐలు, 139 మంది ఎస్సైలు, 250 మంది హెచ్‌సీలు, మరో 500 మంది పోలీసులు నిర్వహించనున్నారు.

## యుద్ధాలకు కాలం చెల్లింది.. అహింస ఒక్కటే మార్గం



రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపై టిబెటన్ ఆధ్యాత్మిక నేత దలైలామా తీవ్రంగా స్పందించారు. యుద్ధాలకు కాలం చెల్లిందని, అహింస ఒక్కటే మార్గమని తెలిపారు. తూర్పు ఐరోపా దేశంలో శాంతిని త్వరగా పునరుద్ధరించాలని పిలుపునిచ్చారు. ఉక్రెయిన్‌పై.. రష్యా దురాక్రమణకు దిగడంపై 14వ దలైలామా ఆవేదన వ్యక్తం చేశారు. మన ప్రపంచం చాలా పరస్పర ఆధారితంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య హింసాత్మక ఘర్షణ ప్రపంచంపై ఎఫెక్ట్ చూపిస్తుందన్నారు. యుద్ధం అనేది పాతదని, అహింస మాత్రమే సమస్యలకు పరిష్కార మార్గమని అన్నారు. అందరినీ సోదర, సోదరీమణులుగా భావించాలని, మానవులంతా ఒక్కటే అన్న భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అప్పుడే మనం మరింత శాంతియుత ప్రపంచాన్ని నిర్మించగలమని తెలిపారు. 20వ శతాబ్దమంతా యుద్ధం, రక్తపాతమయం అయ్యిందని... 21వ శతాబ్దం చర్చల శతాబ్దంగా ఉండాలని చెప్పారు దలైలామా.

### ఈసారి బడ్జెట్ సమావేశాల్లో ప్రసగించని గవర్నర్..?

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి హరీష్ రావు బడ్జెట్‌ను ప్రవేశపెడతారని ప్రభుత్వ వర్గాల విశ్వసనీయ సమాచారం అందుతోంది. అయితే, సభ ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. గవర్నర్ ప్రసంగం ఉండబోదంటూ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం సంచలనం రేకెత్తిస్తోంది. అయితే, ఈ విధానం ఇప్పుడేమీ కొత్త కాదని, గతంలో కూడా ఇలా జరిగిందని గుర్తు చేస్తున్నారు అసెంబ్లీ అధికార వర్గాలు. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో రాష్ట్రపతి పాలన విధించారు. ఆ సందర్భంలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం లేకుండానే సమావేశాలు నిర్వహించారు. ఇక 1970 లోనూ గవర్నర్ ప్రసంగం లేకుండానే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించిన దాఖలాలను ఉదాహరణగా చూపుతున్నారు అధికారులు. ఇదిలాఉంటే.. మనరాష్ట్రంలోనే గాక.. పశ్చిమ బెంగాల్‌లోనూ ఇలాంటి పరిస్థితే చోటు చేసుకుంది. పశ్చిమ బెంగాల్‌లో 2021 బడ్జెట్ సమావేశాలకు అక్కడి ప్రభుత్వం కూడా గవర్నర్‌ను ఆహ్వానించలేదు.

## మార్చి 31వ తేదీలోగా వైద్య కళాశాల పనులు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి**



మంచిర్యాల బ్యూరో, ఫిబ్రవరి 28, ప్రజాపాలన :జిల్లాలోని ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా 14 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వం చేపట్టిన వైద్య కళాశాల నిర్మాణ పనులను మార్చి 31వ తేదీ లోగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరుగుచున్న వైద్య కళాశాల నిర్మాణ పనులను మంచిర్యాల శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుండి తరగతులు ప్రారంభించేందుకు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, వైద్య కళాశాలలో బ్లాక్-1, బ్లాక్-2, లెక్చరర్స్ హాల్స్, తరగతి గదుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి భవనాన్ని సిద్ధం చేసి అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ పెంట రాజయ్య, టి.ఎన్.ఎం.ఐ. ఎన్.ఈ. దేవేందరకుమార్, రోడ్లు భవనాల శాఖ ఈ. ఈ. రాము, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బహుజన స్ఫూర్తిని అందించేందుకే..

## ప్రశ్న మాది.. లక్ష మీది కార్యక్రమం



(మొదటి పేజీ తరువాయి)

అంబేద్కర్ టీవీ చైర్మన్ డాక్టర్ కె. శివ భాగ్యరావు అన్నారు. సోమవారం సాయంత్రం విశాఖ అంబేద్కర్ టీవీ, స్నేహ టీవీ కార్యాలయం లో ఈ ప్రత్యేక కార్యక్రమం పై సమీక్షా సమావేశాన్ని పూలే అంబేద్కర్ రాజ్యాధికార సంబందించిన ప్రశ్నవలి, కార్యాచరణ ను సిద్ధం చేయాలని పార్స్ కమిటీ కి సూచించారు. ఈ సమావేశం లో పార్స్ కమిటీ నాయకులు స్నేహ సి. ఇ. వో. పున్నారావు, పార్స్ కమిటీ జాతీయ కన్వీనర్ డాక్టర్. సీతా మహాలక్ష్మి, మాన్ ఫెస్టో కమిటీ చైర్మన్ డాక్టర్ పెద్దపల్లి అప్పారావు, ప్రోగ్రాం చైర్మన్ ఆచార్య ఆర్. శ్యాం సుందర్, పార్స్ నాయకురాలు ఎన్. సంధ్య, వై. యామిని పద్మ ప్రియ, ఎస్. వి. పద్మావతి, జగదాంబ సోమయజుల సాయి జగతి తదితరులు పాల్గున్నారు. స్లగ్. వివిఎస్పీ చైర్మన్ మీటింగ్ బ్యూరో.. కూన కాళిదాస్ వీడియో.. మౌలానా యాంకర్ బహుజన మహనీయుల సామాజిక స్ఫూర్తి ని, ఆశయాలను ప్రజలకు అందించే లక్ష్యం తో మీలో ఎవరు లెజెండ్ బహు జన్? ప్రశ్న మాది.. లక్ష మీది. అనే సరికొత్త ప్రోగ్రాం ను ఏప్రిల్ 14న హైదరాబాద్ లో ప్రారంభిస్తున్నామని అంబేద్కర్ టీవీ చైర్మన్ డాక్టర్ కె. శివ భాగ్యరావు అన్నారు. సోమవారం సాయంత్రం విశాఖ అంబేద్కర్ టీవి, స్నేహ టీవీ కార్యాలయం లో ఈ ప్రత్యేక కార్యక్రమం పై సమీక్షా సమావేశాన్ని పూలే అంబేద్కర్ రాజ్యాధికార సంబందించిన ప్రశ్నవలి, కార్యాచరణ ను సిద్ధం చేయాలని పార్స్ కమిటీ కి సూచించారు. ఈ సమావేశం లో పార్స్ కమిటీ నాయకులు స్నేహ సి. ఇ. వో. పున్నారావు, పార్స్ కమిటీ జాతీయ కన్వీనర్ డాక్టర్. సీతా మహాలక్ష్మి, మాన్ ఫెస్టో కమిటీ చైర్మన్ డాక్టర్ పెద్దపల్లి అప్పారావు, ప్రోగ్రాం చైర్మన్ ఆచార్య ఆర్. శ్యాం సుందర్, పార్స్ నాయకురాలు ఎన్. సంధ్య, వై. యామిని పద్మ ప్రియ, ఎస్. వి. పద్మావతి, జగదాంబ సోమయజుల సాయి జగతి తదితరులు పాల్గున్నారు.

## పెనమలూరు అసెంబ్లీ అధ్యక్షుడిగా కాకాని ప్రసాదరావు



ఫిబ్రవరి 28 ప్రజాపాలన ప్రతినిధి : పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి(పార్స్) కృష్ణ జిల్లా పెనమలూరు అసెంబ్లీ అధ్యక్షులుగా కాకాని ప్రసాదరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పార్స్ వైస్ ప్రెసిండెంట్ నమ్మి అప్పారావు, కాకాని ప్రసాదరావు ను కృష్ణ జిల్లా పెనమలూరు అసెంబ్లీ అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అధ్యక్షులుగా కాకాని ప్రసాదరావు, రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్, అసెంబ్లీ, జిల్లా, మండలాల్లో నాయకత్వాన్ని తయారు చేయాలని తద్వారా బహుజన రాజ్యాధికార ఆవశ్యకతను గుర్తించే విధంగా కృషి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాకాని ప్రసాదరావు ను సిడబ్ల్యుసి మెంబెర్, ఆంధ్రప్రదేశ్ పార్స్ ఇంచార్జి గూడూరు సీతామహాలక్ష్మి అభినందనలు తెలియజేశారు. కాకాని ప్రసాదరావు నియామకం పట్ల పలువురు బహుజనులు హర్షం వ్యక్తం చేశారు.

## సమాజం నిర్మాణంలో మీడియా పాత్ర కీలకమైనది: విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి




వికారాబాద్ ఫిబ్రవరి 28 : సమాజం నిర్మాణంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం విద్యా శాఖ మాత్యులు సబితా ఇంద్రారెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ సునితా మహేందర్ రెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి వికారాబాద్ జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో తెలంగాణ స్టేట్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ 2022 డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీడియా ప్రభుత్వానికి ప్లజలకు మధ్య వారధిగా పని చేయాలని సూచించారు. అధికారుల, రాజకీయ ప్రతినిధుల తప్పొప్పులను కూడా వ్యక్తపరచాలన్నారు. ప్రజా శ్రేయస్సుకు ఉపయుక్తమైన వార్తలను ప్రచురింపజేయాలని స్పష్టం చేశారు. విలేఖరుల సమస్యలను సిఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇంటి స్థలాలు డబుల్ బెడ్ రూంల గురించి త్వరలో తీపికబురు వింటారని ఆశాభావం వ్యక్తం చేశారు. విలేఖరూలు, రాజకీయ ప్రతినిధులు కలిసి మెలసి పని చేయాలని హితవు పలికారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సునీతా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కేంద్రంలో జర్నలిస్టుకాలనీ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమాజానికి ఉపయోగపడే కథనాలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, వైస్ చైర్ పర్సన్ శంషాద్ బేగం, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, పార్టీ నాయకులు, జిల్లా విలేఖరుల బృందం తదితరులు పాల్గొన్నారు. టియుడబ్ల్యూజె ఐజెయు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ చారి, కొత్తపల్లి శ్రీధర్, ఉపాధ్యక్షులు వెంకటరమణ, కోశాధికారి రాఘవేందర్, సీనియర్ పాత్రికేయులు వైద్యనాథ్ గిరీష్ స్వామి ఈసి మెంబర్ ఆనంద్ కోటపల్లి నర్సిములు గోపాల్ గైబులు చుక్కయ్య మహేందర్ రవీందర్ సుధగల్ల వెంకట్ జాకా వెంకటేశ్ అశోక్ ప్రమోద్ మహేష్ ప్రవీణ్ చారి బాలయ్య జిల్లా లోని ఆయా మండలాల విలేఖరులు పాల్గొన్నారు.

## సైన్స్ ల్యాబ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



బెల్లంపల్లి ఫిబ్రవరి 28 ప్రజా పాలన ప్రతినిధి: బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలకేంద్రంలోనీ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 10 లక్షల రూపాయల తో నూతనంగా నిర్మించిన అటల్ టింకరింగ్ ( సైన్స్ ) ల్యాబ్ ను సోమవారం నాడు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని పేద విద్యార్థినీవిద్యార్థులకు ఉన్నత చదువుల కోసం పై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, అందులో భాగంగానే, గతంలో అనేక ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాలను స్థాపించారని, వాటిలో వేలాది మంది పేద విద్యార్థినివిద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకున్నారని తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు - మన బడి, మన బస్తి - మన బడి అనే ప్రతిష్టాత్మక పథకం ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించిందని, తద్వారా తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయని తెలిపారు. కావున పేద విద్యార్థినివిద్యార్థులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి , జడ్పీటీసీ శ్యామల-రాంచందర్ , గ్రామ సర్పంచ్ సుజాత , పిఎ సిఎస్ చైర్మన్ మల్లేష్ , మండల ఎంపీటీసీలు, సర్పంచ్ లు, ఇతర ప్రజాప్రతినిధులు, మండల కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం గారు, ఆత్మా చైర్మన్ రాజు , తెరాస నాయకుడు భీమగౌడ్ , మంచిర్యాల జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు , జిల్లా సైన్స్ అధికారి మధుబాబు , మండల విద్యాధికారి మహేశ్వర్ రెడ్డి గారు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ గారు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు .

## పంపు ఆపరేటర్లకు త్వరలోనే ప్రమోషన్లు కల్పిస్తాం: శ్రీనివాస రావు



బెల్లంపల్లి ఫిబ్రవరి 28 ప్రజాపాలన ప్రతినిధి: బెల్లంపల్లి ఏరియా లో ని ఖైరిగూడ ఓపెన్ కాస్ట్ కార్మికులకు అర్హులైన వారికి పంప్ ఆపరేటర్ గా ప్రమోషన్లు త్వరలోనే ఇప్పిస్తామని బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు మల్ రాజ్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నాడు గనీ మేనేజర్ కుఆయన వినతి పత్రం సమర్పించారు, ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులకు న్యాయంగా ప్రమోషన్లు ఇప్పించడం జరిగిందని మిగిలిపోయిన వారికి కూడా ప్రమోషన్లు త్వరలో నోటీసు బోర్డు ద్వారా తెలియజేసి ఇప్పిస్తామని అన్నారు. మార్చి 2022 నుండి కార్మికులకు యాక్టింగ్ ల ఆధారంగా ప్రమోషన్ ఇప్పించడానికి జనరల్ మేనేజర్ తో మరియు కొత్తగూడెం అధికారుల తో మాట్లాడి ఒప్పించామని త్వరలో నే తెలియజేసి దరఖాస్తులు స్వీకరించి అర్హత కలిగిన వారికి యాక్టింగ్, ఆధారంగా ప్రమోషన్లు ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. దీనికి కార్మికులందరూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి కార్ణాతం వెంకటేష్ , జి ఎం కమిటీ మెంబర్ గజెల్లి చంద్రశేఖర్, మారిన వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రావినూతల సైన్స్ దినోత్సవం లో ప్రోటోకాల్ రగడ

**ఆహ్వానం పంపించి అవమానించారని సర్పంచ్ మండిపాటు**



బోనకల్ ఫిబ్రవరి28 ప్రజా పాలన ప్రతినిధి : సోమవారం రోజున మండల పరిధిలోని రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సైన్స్ దినోత్సవం లో ప్రోటోకాల్ వివాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఇందిరా జ్యోతి పాఠశాలలో జరిగే సైన్స్ దినోత్సవం లో జరిగే కార్యక్రమం ను తిలకించడం కొరకు రావినూతల గ్రామపంచాయతీ పాలకవర్గం రావలసిందిగా ఆహ్వానం పంపించారు. కానీ గ్రామ సర్పంచ్ , మరియు ఉప సర్పంచ్, పాలకవర్గం లేకుండానే ఎంపీపీ కంకణాల సౌభాగ్యం చే నూతనంగా ప్రారంభించిన సైన్సు ల్యాబ్ ను ప్రారంభోత్సవం చేయించడం జరిగింది. ఈ విషయం పై రావినూతల గ్రామ సర్పంచ్ తీవ్రంగా మండిపడ్డారు. కనీసం గ్రామ సర్పంచ్ గాని పాలకవర్గం కానీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కూడా లేకుండా కార్యక్రమాన్ని నడిపించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందిరా జ్యోతి పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

**ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా జ్యోతి వివరణ**

ఇదే వివాదంపై గ్రామ సర్పంచి కొమ్మినేని ఉపేందర్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఇందిరా జ్యోతిని ఫోన్లో సంప్రదించగా తనకు తెలియకుండా తన సిబ్బంది చేసిన పొరపాటు వల్ల ఇలా జరిగిందని సైన్స్ ల్యాబ్ ప్రారంభోత్సవం తనకు తెలియకుండానే జరిగిందని పొంతన లేని సమాధానాలు చెప్పడం జరిగింది. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు కు తెలియకుండా పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు జరగటం కొసమెరుపు వ్యవహరించారు.

## ఎస్ ఆర్ ఠాగూర్ విద్యా సంస్థలో సైన్స్ డే వేడుకలు




వైరా: జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఠాగూర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ 1928 ఫిబ్రవరి 28 రామన్ ఎఫెక్ట్ ద్వారా ప్రపంచ దేశాలలో శాస్త్ర, విజ్ఞాన, పరిశోధనా రంగాలలో భారతదేశానికి తగిన గుర్తింపు లభించిందన్నారు. ప్రపంచ నోబెల్ బహుమతి కమిటీ 1930 లో రామన్ ఎఫెక్ట్ కు గాను సి.వి.రామన్ గారికి నోబెల్ బహుమతి ప్రధానం చేసి గౌరవించింది అని, 1954 లో భారతరత్న అవార్డు బహుకరించింది అన్నారు. కేంద్ర ప్రభుత్వం రామన్ కు లభించిన నోబెల్ బహుమతిని దృష్టిలో ఉంచుకొని దేశంలో శాస్త్ర విజ్ఞాన రంగాలను అభివృద్ధి చేయాలని, ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, విద్యార్థులందరూ శాస్త్ర పరిశోధనా రంగాలలో పరిజ్ఞానాన్ని సంపాదించి తగిన గుర్తింపు పొందాలని, నిరంతర పరిశోదన స్వతంత్రంగా ఆలోచించే ప్రవృత్తి, ఇవే విజ్ఞానశాస్త్ర సాగరాన్ని మధించి వేస్తాయని సివి రామన్ అన్న మాటలు నేటికి ఆలోచింపజేసేవి అని అన్నారు. విద్యార్థులు శాస్త్ర, విజ్ఞాన, పరిశోధనా రంగాలలో రాణించాలని, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, విద్యాసంస్థకు మంచి పేరు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ సంక్రాంతి సునీత, ప్రిన్సిపాల్ కృష్ణారావు, రామకృష్ణ, లింగరావు గుంటుపల్లి కృష్ణ, నందిని, సురేష్ మొదలగు వారు పాల్గొన్నారు.

## మందమర్రి ఆర్ ఎం పి, పి యం పి ల నూతన అధ్యక్షుడిగా కట్ల శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక



మందమర్రి ఫిబ్రవరి 28 ప్రజాపాలన ప్రతినిది: మందమర్రి పట్టణంలో ఆర్ ఎం పి, పి యం పి ల ఎన్నికలు నిర్వహించినట్లు కట్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ ఎన్నికలలో కట్ల శ్రీనివాస్ అధ్యక్షుడిగా, గౌరవ అధ్యక్షుడిగా రవికుమార్, ప్రధాన కార్యదర్శి గా వెంకటేశం, ఉపాధ్యక్షుడిగా పోషం, కోశాదికారిగా లక్ష్మణ్, సలహాదారులుగా తిరుమల్ రెడ్డి, ఎంపిక కావడంతో వారికి రాష్ట్ర కార్యదర్శి గాదసు శంకర్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## మందమర్రి నూతన రెవెన్యూ అదికారిని సన్మానించిన టి ఆర్ ఎస్ నాయకులు

మందమర్రి ఫిబ్రవరి 28 ప్రజాపాలన ప్రతినిది: మందమర్రి మండల రెవెన్యూ అధికారిగా పదవీ భాధ్యతలు చేపట్టిన సంపతి శ్రీనివాస్ ను మందమర్రి మండల టిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు దేవరనేని సంజీవరావు మండల యూత్ అధ్యక్షుడు పెంచల మదు చిర్రకుంట యూత్ అధ్యక్షుడు నమసాని శేఖర్, టిఆర్ ఎస్ కార్యకర్త మల్లేష్ లు శాలువతో సన్మానించారు.

## క్రైస్తవ మత పవిత్రతను దెబ్బతీసే వారిపై చర్యలు తీసుకోవాలి : ఆలిండియా దళిత,క్రైస్తవ సంఘాల సమాఖ్య



హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి) :క్రైస్తవ మత పవిత్రతను భ్రష్టు పట్టించేలా కొంత మంది సిలువ బొట్టు ధారణ చేయాలని ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు రెవరెండ్ సుందర్ రాజు.సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఆలిండియా దళిత,క్రైస్తవ సంఘాల సమాఖ్య,క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ, ఇండియన్ క్రిస్టియన్ కౌన్సిల్, క్రైస్తవ ధర్మ ప్రచార పరి రక్షణ సమితి సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో జెరూసలేం మత్తయ్య తో కలసి ఆయన మాట్లాడుతూ భారత దేశ సంస్కృతిని, సంప్రదాయాలను అవహేళన చేస్తూ మత సామరస్యాన్ని దెబ్బతీసేలా కొంత మంది ఒపీరిస్టులు క్రైస్తవ పరిశుద్ధ మార్గమును అపవిత్రం చేస్తున్నారని మండిపడ్డారు. సిలువ బొట్టు ధారణ వల్ల మత విద్వేషాలు పెరుగుతాయన్నారు. తెలంగాణ హెూమ్ మినిస్టర్, డిజిపి ని కలసి ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కొరనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రైస్తవ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## భరత్ టెక్నో స్కూల్లో ఘనంగా సైన్స్ సంబరాలు



మధిర ఫిబ్రవరి 28 ప్రజాపాలన ప్రతినిధి మధిర మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నాడు భరత్ టెక్నో స్కూల్ నందు నేషనల్ సైన్స్ డేకార్యక్రమము ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి పాల్గొని సి.వి రామన్ చిత్రపటానికి పూల మాలలు వేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.భారతరత్న నోబెల్ బహుమతి గ్రహీత సి.వి రామన్ ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్ కనుగొని శాస్త్ర ప్రపంచాన్ని అబ్బుర పరిచారని తెలియజేశారు.కావున విద్యార్థులు సివి రామన్ ని ఎంతో ఆదర్శంగా తీసుకొని జీవితంలో అత్యున్నత స్థాయికిచేరుకోవాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు,రవీందర్ రెడ్డి,నాగరాజు, అజిమ్,త్రివేణి,ప్రియాంక,భవాని, పావని,రాజ్యలక్ష్మి,ఉమా,స్రవంతి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## మాణిక్యమ్మ మెమోరియల్ తరపున నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం



బోనకల్, ఫిబ్రవరి 28 ప్రజా పాలన ప్రతినిధి: మాణిక్యమ్మ మెమోరియల్ ట్రస్ట్ సోమవారం గార్లపాడు గ్రామం లో ఒక నిరుపేద కుటుంబమైన, ఇరుగు రాజేష్ చిన్ననాటి నుండి వికలాంగుడు. అంగవైకల్యంతో బాధపడుతూ ఉన్నాడు గత కొద్ది రోజుల క్రితం ఖమ్మం ప్రభుత్వ హాస్పిటల్ లో అనారోగ్యంతో బాధపడుతున్నారు. గార్లపాడు యూత్ (వంశీ)కొన్ని వాట్సాప్ గ్రూపు లో తెలియజేయడం జరిగింది. దీన్ని చూసి స్పందించిన మాణిక్యమ్మ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బోనకల్ వాసి అంతోటి శివ కృష్ణ , ఉషారాణి. దంపతులు.వీరి యొక్క కుమార్తె సాత్విక పుట్టినరోజు సందర్భంగా ఇరుగు రాజేష్ కి బోనకల్ మండల ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శ్రీకాంత్ చేతులమీదుగా.(2000.నగదు50%ఎస్త్ర%ల రైస్) సహాయం చేశారు. ఈ కార్యక్రమానికి స్వేరోస్ జిల్లా అధ్యక్షులు జగదీష్ .గార్లపాడు గ్రామ సర్పంచ్ దారెల్లి నరసమ్మ, గ్రామ యువత కనక పూడి అనిల్ కుమార్, గంధం వంశీ, కనక పూడి నాగరాజు బోనకల్ గ్రామస్తులు అంతోటి వెంకటేశ్వర్లు, వార్డ్ మెంబర్ ఉప్పర శ్రీను. గార్లపాడు మాజీ కనక పూడి వెంకట నరసమ్మ. అంతోటి వంశీ,రఘు,పాల్గొన్నారు.

## హరితహారానికి నర్సరీలు సిద్ధం చేయాలి

ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 28 (ప్రజాపాలన, ప్రతినిధి) : జూలైలో నిర్వహించే హరితహారానికి జిల్లాలోని గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసిన నర్సరీలో మొక్కలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని నర్సరీ తో పాటు అడా, మాణిక్ గుడా, జండా గూడా, గ్రామపంచాయతీ నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నర్సరీలలో మొక్కల పెంపకం పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. రానున్నవేసవిలో నర్సరీ బెడ్ పై ఎండ తాగకుండా గ్రీన్ షెడ్ నెట్లు వేయాలని సూచించారు. అన్ని రకాల మొక్కలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మొక్కల పెంపకం పై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు వంశీ, కృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పొంగులేటి అనుచరుల జోలికి వస్తే ఖబడ్దార్

### శ్రీనన్న అనుచరులపై జరిగిన దాడి ని ఖండించిన గోవిందాపురం ఏ గ్రామ టిఆర్ఎస్ నాయకులు



బోనకల్ ,ఫిబ్రవరి 28 ప్రజా పాలన ప్రతినిధి: ఇటీవల కొత్తగూడెం జిల్లా మల్లె మడుగులో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు వెళ్లిన పొంగులేటి శ్రీనన్న అనుచరులు, పిడమర్తి రవి, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, తుళ్లూరు బ్రహ్మయ్య,లపై రేగా కాంతారావు జరిపిన దాడిని బోనకల్ మండలం గోవింద పురం (ఏ) గ్రామ టిఆర్ఎస్ కమిటీ తీవ్రంగా ఖండించింది. సోమవారం గోవిందపురం గ్రామంలోని రైతు వేదిక లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కోసం కెసిఆర్ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న పొంగులేటి శ్రీనన్న మీద చిల్లర రాజకీయాలు చేస్తే భవిష్యత్తులో ప్రజలే బుద్ధి చెబుతారని, రాజ్యాంగ సృష్టికర్త అంబేద్కర్ విగ్రహావిష్కరణ లో రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడటం దురదృష్టమని అన్నారు. రోజురోజుకీ ప్రజల్లో పొంగులేటి మీద పెరుగుతున్న అభిమానాన్ని చూసి తట్టుకోలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం అయితే చూస్తూ ఊరుకోమని వారికి ధీటుగా సమాధానం చెబుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల నాయకులు భాగం నాగేశ్వరరావు ,ఎన్నారై భాగం రాకేష్, షేక్ ఫకీర్ సాహెబ్, మాజీ వైస్ ప్రెసిడెంట్ షేక్ మదర్ సాహెబ్, టిఆర్ఎస్ గ్రామ సీనియర్ నాయకులు గుడి మల్ల కొండయ్య, పంచాయతీ వార్డు నెంబర్ వడ్డెబోయిన చుక్కయ్య, షేక్ నాగులు,షేక్ మౌలాలి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలి బూడిదయిన గుండ నరేందర్ ఇల్లు



మల్లాపూర్, ఫిబ్రవరి 28 (ప్రజాపాలన ప్రతినిధి): మల్లాపూర్ మండలం గొర్రెపల్లి గ్రామంలో గుండ నరేందర్ తండ్రి గుండ గంగాధర్ నివాసఇంటిలో సోమవారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం సంభవించి ఇల్లు పూర్తిగా కాలి బుడిదయ్యింది. ఇంటి యజమాని గుండ నరేందర్ తెలిపిన వివరాలప్రకారం సుమారు రూ. 15 నుండి 20 లక్షల విలువగల బారి ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలుపుతూ ప్రమాదానికి కరెంటు సర్క్యూట్ కారణమయ్యి ఉండవచ్చని కంటతడి పెట్టుకున్నారు. పూర్తిస్థాయిలో అధికారులుకూడా పరిశీలించి ఆర్థిక సహాయం చెయ్యాలని ఇటు అధికారులను అటు ప్రభుత్వాన్ని కుటుంబ సభ్యులు వేడుకున్నారు.

## అంగరంగ వైభవంగా దుబ్బరాజేశ్వర స్వామి కళ్యాణ మహెూత్సవం



సారంగాపూర్, ఫిబ్రవరి 28 (ప్రజాపాలన ప్రతినిధి): సారంగాపూర్ మండల్ పెంబట్ల శ్రీ దుబ్బరాజేశ్వర స్వామి కళ్యాణ మహెూత్సవం రాత్రి 8 గంటలకు అంగారంగా వైభవంగా జరిగింది. జిల్లా కలెక్టర్ రవి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి కళ్యాణ మహెూత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశం గౌడ్ ఆర్డీవో మాధురి ఎంపీపీ కోల జమునశ్రీనివాస్ జడ్పీటీసీ మేడిపల్లి మనోహర్ రెడ్డి వైస్ ఎంపీపీ సోల్లు సురేందర్ తహశీల్దార్ శ్రీలత ఎంపీడీవో వెంకటేశం ఎంపీవో శశికుమార్ ఈవో కాంతారెడ్డి ఆలయ ట్రస్టు చైర్మన్ పోరండ్ల శంకర య్య సర్పంచులు బొడ్డుపల్లి రాజన్న ఆకుల జమున ధర్మకర్తలు భక్తులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. పోలీసులు సీఐ కృష్ణకుమార్ ఎస్సై జాడి రామకృష్ణ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మధిర హరిజనవాడ హైస్కూల్ నందు ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



మధిర ఫిబ్రవరి 28 ప్రజా పాలన ప్రతినిధి మధిర మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నాడుజాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మధిర హరిజనవాడ నందు క్విజ్, వ్యాసరచన, సైన్స్ ప్రయోగాలు, చార్ట్స్ ప్రదర్శన నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి నందూరి విజయశ్రీ సి.వి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేడం మాట్లాడుతూ సి.వి రామన్ గారి ని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు పరిశోధన రంగంలో ఆ శక్తిని పెంచుకోవాలని, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రేగళ్ళ పురుషోత్తం గారు సైన్స్ పట్ల విద్యార్థులకు ఉ ండాల్సిన దృక్పథాన్ని వివరించారు. మన చుట్టూ జరుగుతున్న ప్రతి విషయాన్ని శాస్త్రీయంగా విశ్లేషించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు శ్రీమతి యస్ వివేక, %బా%.నరసింహారావు,%ఖ%. శ్రీనివాస రావు,%=% విజయలక్ష్మి, రఘు బాబు, %బ్రా%. సుధాకర్,%ఎ%. సునీత,%ు%. సీత పాల్గొన్నారు.

## రావినూతల పాఠశాలలో సైన్స్ డే కార్యక్రమం



బోనకల్ ఫిబ్రవరి 28 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని రావినూతల ప్రాథమిక పాఠశాలలో అకాడమిక్ ఎన్రిచ్మెంట్ ప్రోగ్రాం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సివి రామన్ జ్ఞాపకార్థం గా సైన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు తయారుచేసిన భౌతిక జీవ శాస్త్రానికి సంబంధించిన ప్రయోగాలు మోడల్ చార్ట్స్ పెట్టి సైన్స్ మేళా నిర్వహించారు. ఈ సైన్స్ మేళా ను బోనకల్ మండలం ఎంపీపీ కంకణాల సౌభాగ్యం రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. సైన్స్ మేళ ను ఎంపీడీవో శ్రీదేవి, సర్పంచి కొమ్మినేని ఉ పేందర్, ఉపసర్పంచ్ బోయినపల్లి కొండలు, ఎంపీటీసీ కందిమల్ల రాధ, ఎస్ఎంసి చైర్మన్ టి రామారావు, జడ్.పి. హెచ్.ఎస్ బోనకల్, సెంట్ మేరీస్, బోనకల్ షైన్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు, పి ఎస్ రావినూతల, హెచ్ డబ్ల్యు పి ఎస్ రావినూతల విద్యార్థినీ విద్యార్థులు మొత్తం 500 మంది ఈ ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందిరా జ్యోతి, ఉపాధ్యాయులు కె బేబీ, జి సుజాత, వి ప్రమీల, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జాతరకు ముస్తాబైన మృత్యుంజయ దేవస్థానం

### భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలు సహకరించాలని దేవస్థానం కమిటీ



మధిర ఫిబ్రవరి 28 ప్రజా పాలన ప్రతినిధి మధిర మున్సిపాలిటీ పరిధిలో మధిర పట్టణ లో మంగళవారం నాడు మహాశివరాత్రి సందర్భంగా రెండో కాశీగా పిలవబడుతూ ఉన్న మృత్యుంజయ జయ దేవాలయంలో మహాశివరాత్రి జాతర ఒకటో తారీకు నుండి నాలుగో తారీఖు వరకు జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.కేంద్రమైన శ్రీ మృత్యుంజయ దేవస్థానం మహాశివరాత్రి జాతరను పురస్కరించుకొని అన్ని రకాల ముస్తాబు చేశారు భక్తుల సౌకర్యార్థం భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు జరుగుతూ స్వామివారి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనానికి క్యూ లైన్ ద్వారా దర్శనం కల్పిస్తూ ప్రజలు భక్తులు సహకరిస్తారని ఆ స్వామి దీవెనలు ఉండాలని ఆలయ కమిటీ తెలిపారుఆంధ్ర తెలంగాణ సరిహద్దు ప్రాంతం కాబట్టి ప్రతి సంవత్సరం జరిగే లాగా జాతర ఐదు రోజులు జరుగుతుందని భక్తులు వేల సంఖ్యలోసంఖ్యలో రావడం జరుగుతుందని అంచనా వేయడంతో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారూ స్వామివారి దర్శనానికి మూడు బారికేడ్లు ప్రత్యేక దర్శనం వంటి సౌకర్యాలు ఇబ్బంది లేకుండా భక్తులకు దర్శనం పొందుతుందని ప్రతిరోజు ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని అదేవిధంగా గా. జాతరలో భాగంగా అన్ని రాజకీయ పార్టీలను భక్తులను సహకరించాలని ఆలయ కమిటీ తెలిపింది ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది అర్చకులు కమిటీ వారు ఆధ్వర్యంలో వాలెంటర్లు సేవా కార్యక్రమంలో భాగంగా అందరి సహకారం తో ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు

## సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ ఆచరించిన మార్గం ఆదర్శనీయం

### జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదనా నాయక్



మంచిర్యాల బ్యూరో, ఫిబ్రవరి 28, ప్రజాపాలన : సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ ఆచరించి, చూపిన మార్గం అందరికి ఆదర్శనీయమని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్నాయక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐ.బి. చౌరస్తా నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ఎఫ్.సి.ఎ. ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ మహరాజ్ 283వ జయంతి ఉత్సవాలలో మంచిర్యాల శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు తో కలిసి హాజరై సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహరాజ్ ప్రజల్లో చిరస్మరణీయుడని, అహింస పాపమని, మత్తు, ధూమపానం శాపమని ప్రజల్లో అవగాహన కల్పిస్తూ శాంతియుత మార్గంలో జీవించాలని తెలిపారని అన్నారు. బంజార జాతి శ్రేయస్సు కోసం అహింస సిద్ధాంతానికి పునాది వేసి ఆచరించి చూపారని తెలిపారు. మత మార్పిడులు, యుద్ధ పరిస్థితులలో బంజారా జాతిని సన్మార్గంలో నడిపించేందుకు విశేష కృషి చేశారని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య గురువు సంత్ సేవాలాల్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని, సమాజ శ్రేయస్సు కోసం సంత్ సేవాలాల్ చూపిన మార్గం, బోధనలు అందరు ఆచరించాలని, సమాజహితం కోసం ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకొని దేశ వ్యాప్తంగా ప్రజలను సన్మార్గంలో నడిపించడంలో సఫలమయ్యారని తెలిపారు. సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజల మేలు కోసం అనేక ఉ ద్యమాలు చేశారని, ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడిలు అరికట్టడం, క్షేత్రధర్మాన్ని రక్షించడం లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. సంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సంత్ సేవాలాల్ మహరాజ్ ధర్మ ప్రచారక్ ప్రేమ్ సింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాడిన పాటలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి జనార్థన్, మున్సిప్ చైర్పర్సన్ పెంట రాజయ్య, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు బదావత్ ప్రకాష్నాయక్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 12, 2022 న జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి



మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 28,ప్రజాపాలన: మార్చి 12, 2022 జాతీయ లోక్ అదాలత్ లను పురస్కరించుకొని ఛైర్మన్, మండల సేవా సంస్థ, మంచిర్యాలను 3 వ ఆదనపు జిల్లా న్యాయమూర్తి డి వెంకటేష్ అధికారులతో, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు ఇన్స్యూరెన్స్ కంపెనీ వారితో సమావేశాన్ని నిర్వహించడం జరిగింది ఈ సదర్భంగా మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఉదయ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ మురాధర్, సీనియర్ న్యాయవాదులు, ఇతర న్యాయవాదులు, పోలిన్ సి ఐ లు, కణాలు కానిస్టేబుల్స్ మరియు మరదల న్యాయ సేవా సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


**THE A P RAJA RAJESWARI MAHILA CO OPERATIVE URBAN BANK LTD,**

7-1-70, Ground Floor, Arunodaya, D K Road, Ameerpet, Hyderabad - 500016
Ph No. 040-23742943, and BHEL No. 040-23026980

**NOTICE OF ANNUAL GENERAL BODY MEETING**

General Body Meeting of the A P Raja Rajeswari Mahila Co Operative Urban Bank Ltd., will be held on Monday the 21st March 2022 at 4.00 P.M. at our Head Office, 7-1-70, Arunodaya, D K Road, Ameerpet, Hyderabad- 500016 to trasact the following Business:-

1. To ratify the action of the Board for Admission of Members, allotment of Shares, Approval of Transfer and Withdrawal during the period from 01.07.2021 to 28.02.2022.
2. To review all Over Due loans and covered under Legal Action.
3. To approve Investments / withdrawn made up 01.07.2021 to 28.02.2022.
4. To Appoint Statutory & Concurrent Auditors and fix remuneration for the F.Y. 2021-2022.
5. To peruse the Policy matters on Overdue Interest on Deposits and Other Provisions / Reserves as per the note placed.
6. To note as per IT, to deduct TDS on Dividend Amount or customers should submit 15G/15H as per rule.
7. To Consider any other matter with the permissions of the Chair.

All the members are requested to attend the General Body Meeting.

**BY ORDER OF THE BOARD OF DIRECTORS**
Sd/-

**Place : Hyderabad** **Anil Kumar Maloo**
**Date : 28.02.2022** **(Managing Director/CEO)**

ప్రజాపాలన

సంపాదకీయం

మంగళవారం 01, మార్చి 2022

# మనిషికి విఘాతం

దేవరకొండ తిలక్ రాసిన 'నల్లజర్ల రోడ్డు' చదవాలి. అందులో దట్టమైన అడవి మధ్యన కారు చెడిపోయి ఆగిపోతే కారు దిగిన నవ యువకుణ్ణి విషసర్పం కాటు వేస్తుంది. అర్ధరాత్రి. ప్రాణాపాయం. సాయం చేసే మనిషి కనిపిస్తే ఆస్తి రాసిమ్మన్నా సరే! కారులోని మనుషులు వెర్రెత్తి చూస్తుండగా ఒక ముసలివాడు తన మనవరాలితో వస్తాడు. గుడిసెలో విరుగుడు మందు లేకపోతే అంత రాత్రీ అడవిలోకి మనవరాలిని పంపి తెప్పిస్తాడు. ప్రాణం నిలబెడతాడు. అతని కోసం ఏమైనా చేస్తాం అంటారు కృతజ్ఞతతో కారులోని మనుషులు. తెల్లవారుతుంది. ఇప్పుడు ముసలివాడిని పాము కాటేస్తుంది. మనవరాలు కారు మనుషులతో తాతను పట్నం తీసుకెళ్ల మంటుంది. కానీ కారు మనుషులకు అర్జెంటు వ్యవహారం మీద వెళ్లాల్సి ఉంటుంది. గత రాత్రి వాళ్లు ఆ ముసలివాడి వల్లే బతికారు. కానీ ఈ ఉదయం ముసలివాణ్ణి వాడి ఖర్మానికి వదిలి బయలు దేరారు. మనిషితనానికి విఘాతం కలిగించే మనుషులు వీరు. మధురాంతకం మహేంద్ర రాసిన 'అతడి పేరు మనిషి' కథ చదవాలి. అందులో కారు చెడి పోయిన వాన సాయంత్రం దానిని డ్రైవ్ చేస్తూ ఒంటరిగా రోడ్డు మీద చిక్కుబడిపోయిన యువతిని ఒక పల్లె యువకుడు ఆదుకుంటాడు. గుడిసెకు తీసుకెళ్లి పొడి బట్టలు ఇస్తాడు. అన్నం పెడతాడు. రాత్రంతా ఆమెకు రక్షణగా ఉండి మరుసటి ఉదయం భద్రంగా పంపిస్తాడు. ఆమె తన లాకెట్‌ను మర్చిపోతే వెతుక్కుంటూ వెళ్లి ఇవ్వబోతే ఆ యువతి ఇంటి మనుషులు థ్యాంక్స్ చెప్పి 'భోజనం చేసి వెళ్లమని' బయట వరండాలో సరిగ్గా కుక్క ఎక్కడ తింటుందో అక్కడ పెట్టబోతారు. యువతి దుఃఖంతో వణికిపోతుంది. మనిషితనానికి విఘాతం కలిగించే అలాంటి మనుషులను చూసి!అల్లం శేషగిరిరావు 'వఱడు' కథ భలే పాఠం. దేశానికి కొత్తగా రైల్వే లైన్లు వేస్తున్న రోజులు. అడవిలో క్యాంప్. రిటైర్ అయిన వృద్ధ గుమస్తా ఇంజనీరుగారిని బతిమిలాడి కుటుంబ అవసరాల రీత్యా పని చేస్తూ ఉంటాడు. అతడి కూతురు నిండు గర్భిణి. ఇంకా చాలా ఖర్చులే ఉన్నాయి. ఆ ఒత్తిడిలో ఆ వృద్ధ గుమస్తా ఏదో పని సరిగా చేయకపోతే ఇంజనీరు గారు ఫైలు ముఖాన కొడతారు. అది చూసి జీపు డ్రైవరు చిన్నయ్యకు కోపం వస్తుంది. వయసులో పెద్దవాడైన గుమస్తా మీద చిన్నవాడివైన నువ్వు ఫైలు కొడతావా అని నిరసన వ్యక్తం చేస్తాడు. ఎందుకు చేస్తాడు? వృద్ధ గుమస్తా మర్యాద కాపాడటానికి! కానీ వృద్ధ గుమస్తా ఇంజనీరు గారికి కోపం రాకుండా చూసుకుంటాడు. 'తల్లి వంటి ఇంజనీరుగారు ఒక దెబ్బ కొట్టడం తప్పా' అని ఎదురు చిన్నయ్యనే అడుగుతాడు. చిన్నయ్య ఇప్పుడు అపరాధి అవుతాడు. ఇంజనీరు గారి అహానికి ఆ చిన్నయ్య డ్రైవర్ ఉద్యోగం ఊడిపోతుంది. అడవిలో వఱడు (హైనా) నేరుగా తాను వేటాడి బతకదు. పులికి ఎరను చూపి అది తినగా మిగిలిన దాన్ని తింటుంది. వృద్ధ గుమస్తా చేసింది అదే. డ్రైవర్ చిన్నయ్యను ఎరగా వేయడం. మనిషితనానికి విఘాతి ఆ గుమస్తా.అనాదిగా మనిషి మనిషితనానికి విఘాతం పుట్టిస్తూనే ఉన్నాడు. మనిషిగా ఉండటానికి నిరాకరిస్తూనే ఉన్నాడు. అతడికి ఆధిపత్యం కావాలి. స్వార్థం కావాలి. 'తనే' కావాలి. అందుకై ప్రాంతం తనది అంటాడు. కులం తనది అంటాడు. మతం తనది అంటాడు. సరిహద్దు తనది అంటాడు. సరిహద్దుకు అవతల ఉన్నదీ తనదే అంటాడు. అతడు వెన్నుపోటు పొడుస్తాడు. విశ్వాస ఘాతుకం చేస్తాడు. విద్వేషాన్ని ప్రజ్వరిల్లజేస్తాడు. హింసను ప్రేరేపిస్తాడు. ఎదుటివాడి రక్తాన్ని ఆశిస్తాడు. యుద్ధాన్ని ఆజ్ఞాపిస్తాడు. మనిషిగా ఉండటం ఎంతో సులువు అని గ్రహించక అందుకు విరుద్ధమైన అతి కష్టమైన పనులన్నీ చేస్తాడు. అప్పుడు సందేహం వస్తుంది మనిషిని నమ్మొచ్చా అని! ఏ మనిషినీ నమ్మకూడదు అని! అల్లాంటి సమయాలలోనే ఎవరో ఒక మనిషి మనిషితనానికి పెద్ద ఉదాహరణగా నిలుస్తాడు. ఓ.హెన్రీ 'లాస్ట్ లీఫ్' గుర్తుంది కదా! న్యూమోనియా సోకిన అమ్మాయి తన కిటికీలో నుంచి చూస్తున్న తీగకు ఆకులు రాలుతూ ఉంటే చివరి ఆకు రాలిన రోజు తాను మరణిస్తానని గట్టిగా నమ్ముతుంది. అన్ని ఆకులూ రాలుతాయి. చివరి ఆకు తప్ప. ఆమె బతుకుతుంది. కానీ గోడ మీద రాలని ఆకును చిత్రించిన వృద్ధ చిత్రకారుడు అందుకై రాత్రంతా మంచులో తడిసి అదే న్యూమోనియాతో మరణిస్తాడు. ఆ వృద్ధ చిత్రకారుడు ఎవడో? ఎవడైతే ఏమిటి, మనిషి!రోజులు అట్టే బాగోలేవు. ఇరుగింటి వారికి పొరుగింటిపై అక్కసు, బంధువులకు బంధువులతో పొసగనితనం, అన్నాచెల్లెళ్ల అక్కాతమ్ముళ్ల మధ్య విఘాతం, ఆఫీసుల్లో సాటి కొలీగ్స్‌పై కక్ష, సమూహాలకు సమూహాలతో వైరం, మతాలకూ మతాలకూ చిచ్చు, దేశాల మధ్య వైరం... ఇంతా చేసి ఇదంతా మనిషి మనిషితనానికి తెస్తున్న విఘాతం. మూడు పూట్లా తిండి, ఒక పూట విసర్జనాన్ని దాటలేకపోయిన మనిషి సాటి మనిషిని బాధించి, సాధించి బావుకునేది ఏమిటి? ఆస్తి, ఎల్లలు పెంచుకోగలడు కానీ కడుపులోని పెద్ద ప్రేవు, చిన్నప్రేవు పరిమాణాన్ని పెంచగలడా? వేళ్ళు ముదిరి పునాదులకే ప్రమాదం వచ్చినప్పుడు చెట్టును కొట్టేయక తప్పదు. మనిషి తనానికి విఘాతంగా మనిషి మారినప్పుడు ఆ మనిషికి గట్టిగా బుద్ధి చెప్పక తప్పదు. చరిత్ర అంతా ఓడిన చెడ్డ మనుషులు, గెలిచిన మంచి మనుషులే! మనిషిపై మనిషికి నమ్మకం మిగిల్చినవాళ్లే! లేకుంటే ఇంతకాలం మనిషి బతకగలిగేవాడా సాటి మనిషిని తోడు చేసుకోక.

# కథగా కల్పనగా కుదించిన స్త్రీత్వం



చాలా కాలం క్రితం మహాశ్వేతాదేవి రచనలు చదువుతున్నప్పుడు 'గాయత్రి చక్రవర్తి స్పివాక్' పేరు తొలిసారిగా విన్నాను. ఆ సమయంలో ఆవిడను మహాశ్వేతాదేవి రచనల అనువాదకురాలిగా మాత్రమే చూశాను. కొన్నేళ్ళ తరువాత డెరిడ్డా వ్యాసాలు చదువుతున్నప్పుడు ఈ పేరెక్కడో విన్నట్లుందే అనుకు న్నాను. పురుషాధిక్య జాడ్యాలకు మినహాయింపుకాని సాహితీ ప్రపంచంలో సుసాన్ సొంటాగ్ లాగే గాయత్రి కూడా 'పబ్లిసిటీ తక్కువ క్రిటిక్' అని వివరాల్లోకి వెళ్తే అర్థ మైంది. భారతీయురాలైన ఆమె పేరు ఇండియాలో తక్కువ వినడం ఒకింత ఆశ్చ ర్యానికి గురిచేసింది. స్త్రీ వాదమనగానే తమ అస్తిత్వాన్ని ఎవరో గుర్తించాలనో, లేదా తమ హక్కుల్ని ఎవరిని నుంచో రాబట్టుకోవాలనో అనుకునే సగటు స్త్రీవాదుల మధ్య సుసాన్ సోంటాగ్, గాయత్రి చక్రవర్తి స్పివాక్ వంటి సాధికారత కలిగిన విమ ర్శకులు బహు అరుదు. వీరి విమర్శ లక్ష్యం కేవలం స్త్రీవాదానికి మాత్రమే పరిమితమవ్వకుండా సాహిత్యంలో పురుషాధిక్య మూలాల్ని పెకలించే దిశగా సాగింది.స్పివాక్ రాసిన వ్యాసాల్లో 'Can the Subaltern Speak' పేరిట రాసిన వ్యాసాన్ని 'పోస్ట్ కలోనియల్ స్టడీస్'లో మిక్కిలి ప్రాధాన్యత కలిగిన వ్యాసంగా పరిగణిస్తారు. మేధావి వర్గాల్లో అంతర్గతంగా ఉండే నిరంకుశత్వాన్ని విమర్శిస్తూ రాసిన ఈ వ్యాసాన్ని నిజానికి 'బడుగుజీవి మాట్లాడగలడా?' అనేకంటే, 'బడుగుజీవి గళం వినబడుతుందా?' అన్న కోణంలోనే రాశారు. థర్డ్ వరల్డ్ గళం వినపడకుండా నిరోధించే అంశాలు అనేకం ఉన్నప్పటికీ, సమాజంలో కీలక స్థానాల్లో ఉన్న విద్యావేత్తలూ, మతాధికారులూ, ఇతర ఉన్నత వర్గాలతో కూడిన శక్తివంతమైన సామజిక వర్గాలను అన్నిటికంటే ముఖ్యమైన కారణంగా చూపిస్తారు స్పివాక్. ముఖ్యంగా పాశ్చాత్య పండితులు 'థర్డ్ వరల్డ్'ని నిర్వచించిన విధానమే లోపభూ యిష్టమైనదని స్పివాక్ అభిప్రాయపడతారు. ఈ క్రమంలో స్పివాక్ వాదనలన్నీ భౌతికమైన హింసకంటే ఆలోచన, భాష, రాత రూపంలో జరిగే Epistemic violence మరింత ఎక్కువ ప్రమాదకరమన్న దిశగా సాగుతాయి. ఉదా హరణకు చరిత్ర నుండి బడుగుజీవుల కథల్ని ఆనవాళ్ళు లేకుండా తుడిచి వెయ్యడం ఈ రకమైన హింస క్రిందకి వస్తుంది. స్త్రీవాదాన్ని కూడా ఇదే వెలుగులో చూపిస్తూ, స్త్రీ గళం అణచివేతకు గురి కావడానికి అటు పితృస్వామ్యంతో బాటు, ఇటు వలసవాదం కూడా ఒక కారణమంటారు. స్పివాక్ రచనల్లో సింహభాగం మేధావి వర్గాల ఆధిపత్యం కారణంగా సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ, సాహితీ రంగాల్లో జరిగే అణచివేతపైనే దృష్టి సారిస్తాయి. బెంగాలీ రచయిత్రి మహాశ్వేతాదేవి కథ 'ద్రౌపది'ని స్పివాక్ ఆంగ్లంలోకి అనువదించడానికి కారణం కూడా అది తాను ప్రతిపాదించిన 'ఎపిస్టమిక్ వయొలెన్స్'ను ప్రతిబింబించే కథ కావడమేనంటారామె. ఆ కథలో– ఒక సైనికాధికారి సేనా నాయక్ ద్రౌపది అనే గిరిజన స్త్రీని బంధించి ఆమెను న్యాయ విచారణచేసే క్రమంలో దారుణ హింసకు గురిచేసి పలువురు ఆమెపై అత్యాచారం చెయ్యడానికి పరోక్షంగా కారణమవుతాడు. ఈ కథను తాను అనువదించడానికి 'ద్రౌపది' ఎంత కారణమో అందులో ప్రతినాయకుడు 'సేనానాయక్' పాత్ర కూడా అంతే కారణమంటారు స్పివాక్. ఆ కథలో సేనా నాయక్ పాత్ర 'ఫస్ట్ వరల్డ్ స్కాలర్' ప్రతినిధిగా 'థర్డ్ వరల్డ్'కి చెందిన ద్రౌపదిని వెతుక్కుంటూ వెడుతుంది. ధర్మాధర్మాల విచక్షణా, సహానుభూతీ ఉన్నప్పటికీ చివరకి సేనానాయక్ తన వృత్తిలో భాగంగా ఫాసిస్టు భావజాలానికి కొమ్ము కాయక తప్పదు.డాంటే మొదలు ఈట్స్ వరకూ సాహిత్యంలో స్త్రీ పాత్రపై దృష్టి సారిస్తూ స్పివాక్ రాసిన 'ఇన్ అదర్ వరల్డ్స్' అనే పుస్తకంలో ఆమె చేసిన కొన్ని విశ్లేషణలు స్త్రీవాదంపై ఆమె భావాలకు దర్పణం పడతాయి. కవితా వస్తువుగా స్త్రీని ఉపయో గించుకోవడంలో డాంటే, ఈట్స్ వంటి వారు అవలంబించిన ద్వంద్వ విలువల్నీ, పురుషాధిక్య భావజాలాన్నీ వారి రచనల్లోని ఒక్కో వాక్యాన్నీ '%ఎవషీఅర్‌తీబష్%' చేస్తూ ఆమె విశ్లేషించిన తీరు చదువుతున్నప్పుడు ఉత్తమ సాహిత్యంగా పరిగణింపబడే సాహిత్యంలో స్త్రీ పాత్ర ఎంత? అనే ప్రశ్న జనించకపోదు. ఈ కవులందరూ సాహిత్యంలో స్త్రీ పాత్రను ఒక జీవం ఉన్న మనిషిగా కాకుండా ఒక ఇమేజ్‌కి మాత్రమే పరిమితం చేయడంపై స్పివాక్ వ్యాఖ్యానిస్తారు. 1977లో జరిగిన వోక్స్ స్త్రీవాద సదస్సులో డాంటే La Vita Nuova మీద రాయబడిన పేపర్ ఒకటి చర్చకు పెట్టినప్పుడు ఆ పేపరు ప్రెజెంటేషన్ పూర్తయిన వెంటనే సభలో ఒక స్త్రీ లేచి "స్త్రీకి ఏ మాత్రం విలువ ఆపాదించని ఈ రచనను స్త్రీలు ఏ విధంగా ప్రశంసించాలి?" అని అడిగారట. దానికి అదే సభలో మరో స్త్రీ లేచి డెరిడ్డా డీకన్‌స్ట్రక్టివ్ సూత్రాన్ని గుర్తు చేస్తూ ఆ రచనకి రచయిత, అంటే ఇక్కడ డాంటే, ఎంత మాత్రం బాధ్యుడు కాదని అన్నారట. డెరిడ్డా సూత్రం ప్రకారం వచనానికి తనను తానే నిరంతరం పునఃనిర్మించుకునే గుణం ఉంటుంది, ఈ కారణంగా స్వయానా రచయిత కూడా ఆ రచనకు బాధ్యుడు కాడు. డాంటే–బీట్రిస్‌ల ప్రేమకథలో డాంటే విపరీతమైన సెల్ఫ్ ఇండల్జెన్స్‌తో బీట్రిస్ పాత్రను ఒక ఇమేజ్‌గా మాత్రమే పరిమితం చెయ్యడం చూస్తాం. డాంటే ఆమెకు హృదయంలో గుడి కట్టి దేవతలా ఆరాధిస్తారు. కానీ నిజానికి ఆమె జీవితాంతం డాంటే ప్రేమను గురించిన స్పృహ లేకుండానే జీవించి పాతికేళ్ళ వయసులో అకస్మాత్తుగా మరణిస్తుంది. ఈ కథలో బీట్రిస్ ఉనికిని పూర్తిగా తన ఆలోచనలకే పరిమితం చేస్తారు డాంటే. వాస్తవానికి ఆమెకు ఒక రూపం ఇవ్వకపోయినా తన ప్రతీ చర్యకూ బీట్రిస్‌ని (ఆమె ఇమేజ్‌ని) కారణభూతంగా చూపించే ప్రయత్నం చేస్తారు. తన కల్పనలో తన కర్మలకు ఆమెను బాధ్యురాలిని చేసి తాను మాత్రం ఎటువంటి బాధ్యతా తీసుకోరు. "బీట్రిస్ కారణంగా నేను అలా వ్యవహరించవలసి వచ్చింది" అని డాంటే అనడంలో నిజానికి బీట్రిస్ పాత్ర ఏమీ ఉండదు. డాంటే రచనలో చర్యా/ ప్రతిచర్యా/ ఉనికీ ఇవేమీ లేని బీట్రిస్ కేవలం 'డాంటే యొక్క ఏజెంట్'గా మిగిలిపోతుంది. మరోవిధంగా చూస్తే ఆమె అతడి 'నాన్ ఏజెంట్': ఆ కారణంగా ఒక ఆబ్జెక్ట్ (బీట్రిస్) స్థానంలో ఉంటూ సబ్జెక్టు (డాంటే) చర్యను ఆమె నియంత్రిస్తుంది. డాంటే తన ఆధిపత్యపు ఉద్దేశ్యాన్ని ఎప్పటికప్పుడు పునఃనిర్మించుకోవడానికి ఆమె ఒక ప్రేరణగా నిలుస్తూ, అతడి నార్సిసిజాన్నీ, మసకిజాన్నీ కప్పెట్టే తెరచాటుగా మారుతుంది. మరికాస్త ముందుకెళ్ళి డాంటే కవిగా తన సృజనాత్మకతనీ, నైపుణ్యాన్ని ఇంకాస్త బిగ్గరగా చాటే పనిలోపడతారు. బీట్రిస్‌ని జీవంలేని ఇమేజ్‌గా మిగిల్చి 'ప్రేమ'ని మాత్రం కవితా సంప్రదాయంలో ఒక జీవం ఉన్న ప్రాణిగా చూపించే యత్నం చేస్తారు. ఆయన రచనలో ప్రేమ గురించిన చేసిన వర్ణనలు ప్రేమ ఒక సజీవమైన వ్యక్తేమో అన్న భ్రమను కలిగిస్తాయి. ఈ ప్రయత్నాన్ని సమర్థించుకునే దిశగా, వర్జిల్, లుకన్, హొరేస్, ఒవిడ్ వంటి వారి ప్రస్తావన తెచ్చి ప్రేమను 'పొయెటిక్ లైసెన్స్' అనే కాలిడోస్కోప్‌లో నుంచి సజీవమైన వ్యక్తిగా చూడొచ్చని నమ్మబలుకుతారు. డాంటే, ఈట్స్ వంటి కవులు స్త్రీని కవితావస్తువుగా చేసుకునే క్రమంలో ఆమెకు తమ సృజనాత్మకతతో ఒక ఆదర్శరూపమిచ్చే ప్రయత్నం చేశారు. స్త్రీ ప్రమేయం ఎంతమాత్రం లేకుండా కాల్పనిక వస్తువుగా ఆమెకు ఆపాదించిన రూపాన్ని మళ్ళీ వారే ఛిద్రం చేస్తారు, ఆ విధంగా ఆమెను 'న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అన్న తీరులో ఆమె ఉనికిని సమూలంగా హరించే ప్రయత్నం చేస్తారు. నిజానికి ఇదంతా పాఠకుల దృష్టికి రాకుండా ఒక రహస్యంలా, వారి శిల్పంలో అంతర్గతంగా ఉంటూ, వారి పంక్తుల్ని ఒకదానితోనొకటి దగ్గరగా కలిపి ఉంచే చర్యలా జరుగుతూ ఉంటుంది. "స్వయం సిద్ధమైన ఉనికిలేని కాల్పనిక వస్తువుగా స్త్రీ ఇమేజిని కుదించేశాక ఇక రచనలో ఎటువంటి ద్వంద్వానికీ చోటివ్వని కవి శిల్పం అతడి కావ్య సాధనలో ఏ రకమైన సంపూర్ణత్వాన్ని సాధిస్తుంది?" అని సూటిగా ప్రశ్నిస్తారు స్పివాక్. ఈ కారణంగా కేవలం వచనాన్ని మాత్రమే సాధనంగా చేసుకుని ఏకపక్షంగా చేసే ఈ రచనలు ఏ విధమైన వైరుధ్యానికీ ఆస్కారం లేకుండా చేసే అవకాశం ఉందంటారు స్పివాక్. ఇదే విశ్లేషణను ప్రముఖ ఫ్రెంచ్ సైకో అనలిస్టు జాక్ లకాన్ పరిభాషలో చెప్పా లంటే– కవులూ, రచయితలూ కేవలం ఇమేజ్‌ని ఆధారంగా చేసుకుని సృష్టించే ఈ తరహా సంబంధాలూ, ఊహలూ, ఫాంటసీలూ సాధారణ దృష్టికీ గమనింపుకీ ఎంత మాత్రం అందేవి కాదు. అందువల్ల భాషా సౌందర్యాల మాటునచేర్చి భావగర్భంగా సమాజంలోకి ప్రవేశపెట్టే ఇటువంటి భావజాలాల్ని నమ్మి పాఠకులు ఆ కాల్పని కతను వాస్తవమని భ్రమపడే అవకాశం ఉంది. అక్కడితో ఆగకుండా అదంతా సహజమనీ, వాస్తవమనీ అంగీకరించే ప్రమాదం కూడా ఉంది.

# సైన్స్ డే సైతం అమృతమయం!

సీవీ రామన్ 1888 జనవరి 7న జన్మించారు. అయితే నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ (ఎన్సీఎస్టీసీ) ఆయన పుట్టిన రోజును కాకుండా, రామన్ ఎఫెక్ట్‌ను కనిపెట్టిన రోజును 'నేషనల్ సైన్స్ డే'గా స్వీకరించడంతో ఫిబ్రవరి 28 'భారత జాతీయ సైన్స్' దినోత్సవం అయింది. అమృత మహొత్సవాల నేపథ్యంలో వచ్చిన సైన్స్ డే కనుక 1947 నుంచి ఈ ఏడున్నర దశాబ్దాల కాలంలో శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన విజయాలను వేడుకగా జరుపుకోవడం సందర్భోచితమే అయినప్పటికీ... సైన్స్ వేడుకలకు 'విజ్ఞాన్ సర్వత్ర పూజ్యతే' అనే సంస్కృత తగిలింపును ఇవ్వడం సమంజమేనా అనే ప్రశ్న వస్తుంది. ఈ తగిలింపు వల్ల శాస్త్ర సాంకేతిక కృషి స్వదేశీ సంప్రదాయాల్లోని ఒక భాగం అయిందే తప్ప, ప్రత్యేకంగా ఒక భాగం అయినట్లనిపించడం లేదు. 'విజ్ఞాన్ సర్వత్ర పూజ్యతే' అంటే 'విజ్ఞానం అన్నిచోట్లా గౌరవం పొందుతుంది' అని. ఈ మాట, 'విద్వాన్ సర్వత్ర పూజ్యతే' అనే సంస్కృత శ్లోకభాగానికి అనుకరణ. ఆ శ్లోకంలోని విద్వాన్ అనే మాట స్థానంలో విజ్ఞాన్ అనే మాటను పెట్టి సైన్స్ డేకి ఉప శీర్షికగా తగిలించిన కారణంగా సైన్స్‌కు సంస్కృతి రంగును వేసినట్లయింది. డెబ్బై ఐదేళ్ల స్వాతంత్ర్య అమృత మహొత్సవాలకు ఒక గుర్తింపు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రతి దాన్నీ 75తో బ్రాండింగ్ చేస్తోంది. 75 కార్యక్రమాలు, 75 పోస్టర్లు, 75 చిత్రాలు... ఇలా! ఆఖరికి సైన్స్ డేని కూడా 'అమృత'మయం చేయడంతో ఆ రోజును ఎందుకైతే ఉద్దేశించారో ఆ ఉద్దేశాన్ని తక్కువ చేసినట్లుగా అయింది. సైన్స్‌కి ప్రజాదరణ కల్పించడం అన్నది భారత్ సాధిం చిన శాస్త్ర పురోగతి, విజయాలు, మైలురాళ్లు... వీటికే పరిమితం అవకూడదు. శాస్త్రీయ విధానాలను ప్రజల నిత్యజీవితంలో భాగం చేయడం, ప్రజల్లోని మూఢనమ్మకాలను, అపోహలను తొలగించడం వంటి ప్రయత్నాలు కూడా ముఖ్యమైనవే. ప్రభుత్వేతర సంస్థలు, పౌర సమాజాల భాగస్వామ్యంతో ఈ పని చేయవచ్చు. భోపాల్ గ్యాస్ దుర్ఘటన తర్వాత ప్రజల్లో విషవాయువుల పట్ల జాగరూకత కల్పించి, వారిలో చైతన్యం తెచ్చేందుకు ఎన్సీఎస్టీసీ... తన ఆవిర్భావ సంవత్సరాలలో ఉండి కూడా... 'ఆలిండియా పీపుల్స్ సైన్స్ మూవ్‌మెంట్' అనే ఛత్రం కిందికి స్వచ్ఛంద సేవా సమూహాలన్నీ వచ్చేందుకు ఒక ఉత్ప్రేరకంగా పని చేయ గలిగింది! అదే సమయంలో 'కేరళ శాస్త్ర, సాహిత్య పరిషత్' తన జాతీయ సాక్షరతా మిషన్‌తో దేశవ్యాప్తంగా, భారత జన విజ్ఞాన యాత్రలు జరిపి, ప్రజల్ని మేల్కొలిపే ఒక మహా యజ్ఞాన్ని ప్రారంభించింది. సైన్స్‌ని ప్రజలకు చేరువగా తీసుకెళ్లేందుకు తొలిసారిగా ఎన్సీఎస్టీసీ దేశంలోని ప్రభుత్వ, పాక్షిక ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలను కలుపుకొంటూ ఒక యంత్రాంగాన్ని సంస్థాగత పరి చింది. ఎన్సీఎస్టీసీ సహకారంతో శాస్త్రబృందాలు గ్రామాల్లో పర్యటించి దొంగ స్వాముల అసలు స్వరూపాలను, వారి మాయ మాటల్ని బట్టబయలు చేశాయి. అలాగే సూర్యగ్రహణంతో లంకె ఉన్న అనేక మూఢ నమ్మకాలను పటాపంచలు చేయగలిగాయి. విచిత్రం ఏమిటంటే, సైన్స్‌ను ప్రోత్సహించాలనీ, ప్రజల్లోకి తీసుకెళ్లాలనీ, సమాజంతో అనుసంధానం చేయాలనీ ప్రవచించే ప్రభుత్వ సంస్థలు ఇలాంటి జాగృతి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వకపోవడం, స్వచ్ఛంద సంస్థలను కలుపుకొని వెళ్లకపోవడం! దేశంలోని సైన్స్, టెక్నాలజీ సంస్థలు... సైన్సుకు ప్రజల్లో ఆదరణ కల్పించేందుకు తమ పాత్రపై పునరాలోచన చేసుకోవాలి. జాతీయ ప్రయోగశాలలు, విశ్వ విద్యాలయాలు, ఐఐటీలు ప్రజ లకు సహాయకారిగా ఉండే వనరుల కేంద్రాలు అవాలి. శాస్త్రీయ సంస్థలు తమ నైపుణ్యాలు, ప్రసంగాలతో తమ చుట్టూ ఉన్న ప్రజల్లో సామాజిక చైతన్యం తెచ్చేందుకు కృషి చేయాలి. ఉదా: ఉన్నత విద్యాసంస్థల్లోని శాస్త్రవేత్తలు, సైన్స్‌లో సీనియర్ విద్యా ర్థులు... విద్యా సంస్థలకు వెళ్లి సైన్స్ బోధన మెరుగయ్యేందుకు సహాయపడవచ్చు. పిల్లలు పాఠశాల స్థాయిలోనే సైన్స్ రంగంపై ఆసక్తి ఏర్పడేందుకు ఈ 'సహాయక చర్యలు' తోడ్పడతాయి. బయటి నుంచి వచ్చిన వాళ్లంటే పిల్లలూ ఉత్సాహంగా వింటారు. వాతావరణ మార్పులు, ఇంధనం, ఆహార భద్రత, జల సంరక్షణ, రీసైక్లింగ్, ఇ-వ్యర్థాలు, వన్య ప్రాణుల రక్షణ వంటి శాస్త్ర, సాంకేతిక అంశాలపై ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం ఎప్పుడూ అవసరమే. అందుకు వారిని సైన్స్ సన్నద్ధం చేస్తుండాలి. ప్రభుత్వం కూడా ఆర్భాటపు పథకాలు, ప్రణాళికలపై డబ్బును వృథా చేయకుండా సైన్స్ అభివృద్ధి రంగంలో ఉన్న సంస్థలకు ఆర్థిక వనరులను సమృద్ధిగా సమకూర్చాలి. అప్పుడే సైన్స్ వర్ధిల్లుతుంది. సైన్స్ డే ఉద్దేశం నెరవేరుతుంది.

# బంగారు తెలంగాణ సిఎం కేసీఆర్ తోనే సాధ్యం

## మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకరరావు



వికారాబాద్ బ్యూరో 28 ఫిబ్రవరి ప్రజాపాలన : బంగారు తెలంగాణ సిఎం కేసీఆర్ తోనే సాధ్యమని మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకరరావు లు సంయుక్తంగా అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా పరిషత్ కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా కేసీఆర్ లేకపోతే కొన్ని వైలు రాళ్ల రాష్ట్రం అందుకోలేక పోయేదని పేర్కొన్నారు. తెలంగాణ సాధన వారితోనే సాధ్యం అయ్యిందని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు.గూగుల్ లో సెర్చ్ చేస్తే ప్రపంచంలోనే అతి పెద్దదైన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కేవలం మూడేళ్ళ కాలంలో పూర్తి చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని స్పష్టం చేశారు. వేరే ఎవరు ఉన్నా 30 ఏళ్ళకు కూడా పూర్తి అయ్యేది కాదన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఒక విజన్ తో ఇంటింటికి నల్లాలు ఇచ్చిన ఘనత టిఆర్ఎస్ ప్రభుత్వానిదని కొనియాడారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నేతృత్వంలో పల్లె ప్రగతి ద్వారా నేడు గ్రామాల్లో రూపురేఖలు మారాయని తెలిపారు. ప్రతి ఎకరాకు సాగు నీరు ఇవ్వాలని ముఖ్యమంత్రి పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుతో తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆరు నూరైన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ పై విమర్శలు చేస్తే సహించేది లేదని ఘాటుగా స్పందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వికారాబాద్ మీద ప్రత్యేక దృష్టితో ఉన్నారని గుర్తు చేశారు. జిల్లా అభివృద్ధి పై ఎప్పుడు జిల్లా ప్రజాప్రతినిధులు వెళ్లినా అరా తీస్తారన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా నూతన కలెక్టరేట్లు, ఎస్ పి కార్యాలయాలు నిర్మించి, ప్రస్తుతం జడ్పీ కార్యాలయాలు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు.మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వ పథకాలకు ఢిల్లీలో అవార్డులు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఉన్న బీజేపీ నేతలకు ఇవి కనిపించవా అని విమర్శించారు. కరోనా కాలంలో కూడా ఇతర రాష్టాలు ఆపి వేసిన పెన్షన్లు అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కు దక్కుతుందని వివరించారు. మిషన్ భగీరథ ద్వారా 1300 వందల కోట్లు వికారాబాద్ జిల్లాకు కేటాయించామని స్పష్టం చేశారు.ప్రభుత్వం అందించిన పథకాలు, నిధుల వివరాలు గ్రామ పంచాయతీల ముందు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం చేయాలని సూచించారు. విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలో 8 వేల కోట్ల రూపాయలతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి చెందుతాయన్నారు. జిల్లాకు 150 కోట్లకు పైగా నిధులు ఇచ్చామని ఉద్ఘాటించారు. వికారాబాద్ జిల్లాలోని జడ్పీటీసీ లకు 15 లక్షలు విడుదల చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో మొదటి జడ్పీ భవనం వికారాబాద్ లో నిర్మించ బోతున్నామని పేర్కొన్నారు. త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన జిల్లాలో ఉంటుందని స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంతో పాటు, పార్టీ కార్యాలయం ప్రారంభిస్తారని చెప్పారు. వికారాబాద్ జిల్లా పరిషత్ నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకరరావు, జడ్పీ చైర్ పర్సన్ సునీతా మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ మెతుకు ఆనంద్, కాలే యాదయ్య, పట్నం నరేందర్ రెడ్డి, పైలట్ రోహిత్ రెడ్డి, కొప్పుల మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, కలెక్టర్ నిఖిల, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నాగేందర్ గౌడ్, బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్, జడ్పీ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మురళి కృష్ణ హాజరయ్యారు.

## గొర్రెల కాపరుల సహకార సంఘాల ఎన్నికలు తక్షణమే జరిపించాలి: గుడిగే శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి) :గొర్రెల కాపరుల సహకార సంఘాలు ఎన్నికలు జరిపించి రాష్ట్ర వ్యాప్తంగా వున్న సొసైటీ అధ్యక్షులు గ్రామ గ్రామాల్లో సొసైటీలను అడిట్ చేయించాలన్నారు తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం గౌరవ సలహా దారి గుడిగే శ్రీనివాస్ యాదవ్ .అమీర్ పేటలోని రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సభ్యుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము అశోక్ యాదవ్ తో కలిసి మాట్లాడుతూ ఈ ఎన్నికల కొరకు జిల్లా అధికారులు చొరవ తీసుకొని సహకార సంఘం ఎన్నికలు జరపేలా చూడాలన్నారు.తెలంగాణ రాష్ట్ర గొల్లకుర్మలకు సహకార సంఘంలకు మినీ పాల డైరీ సెంటర్లకు మరియు గ్రేటర్ మున్సిపాల్టి నగరాల్లో వున్న గొల్లకుర్మలకు జీవనోపాధి కోసం ఏన్సీ.డీ.సీ.ద్వారా కేంద్రప్రభుత్వం ప్రతి బడ్జెట్ లో 5వేల కోట్లు సబ్సిడీ రుణాలు గొర్రెల మేకల సొసైటీ లకు మంజూరు చేయాలనీ. రాష్ట్రంలోని ఫారెస్ట్ అధికారులు గ్రామ సర్పంచ్ లు గ్రామపంచాయతీ అధికారులు గొర్రెల మేకల కాపరులకు సహకరించాలని కోరారు ఈకార్యక్రమంలో సంఘం నాయకులు రాష్ట్ర కార్యదర్శి కడారి ఐలయ్య గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ మారమోని శ్రీశైలం యాదవ్ , పోలవేణి మహేందర్ యాదవ్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ , సంతోషం రాంచందర్ , ఎం రాజేష్ రవి తదితరులు పాల్గొన్నారు.

## సినిమా డైరెక్టర్ గొట్టిముక్కుల భార్గవ కి సన్మానం



మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి28, ప్రజాపాలన: వధువు కట్నం సినిమా రిలీజ్ అయిన తర్వాత మొదటిసారి మంచిర్యాలకు వచ్చిన సందర్భంగా సినిమా డైరెక్టర్ భార్గవ కు తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో హైటెక్ సిటీ లో తెలంగాణ బీసీ జాగృతి కార్యాలయంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ భార్గవ గారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి కళారంగంలో చేసిన సేవకు ఇప్పుడు మధు కట్నం సినిమా దర్శకత్వం ద్వారా మంచి ఆదరణ లభించింది. అందుకు ముఖ్యంగా మా అన్నయ్య గొట్టి ముక్కుల శంకరయ్య ప్రోత్సాహం మర్చిపోలేనని. వెలకట్టలేనిది అని అలాగే మంచిర్యాల జిల్లా వాసులకు అదేవిధంగా నేను మళ్లీ తీయబోతున్న చిత్రంలో మంచిర్యాల ప్రాంత కళాకారులకు కూడా అవకాశం కల్పిస్తానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్, జిల్లా మీడియా కన్వీనర్ సంతోష్ ఆచార్య, పట్టణ అధ్యక్షులు మడుపు రామ్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్ ఉపాధ్యక్షులు మేంత్యాల సంతోష్, యువజాగృతి పట్టణ అధ్యక్షులు మాంచర్ల సదానందం ప్రచార కార్యదర్శి బద్ది శ్రీనివాస్ కార్యనిర్వహణ కార్యదర్శి గుమ్ముల సుదర్శన్, సీనియర్ నాయకులు సల్ల విజయ కుమార్, మామిడాల ప్రకాష్, రామగిరి రాజకుమార్, గొట్టుముక్కుల శంకరయ్య, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు విశ్వేశ్వరశర్మ , గుండేటి యోగేశ్వర్, బోనగిరి రాజిరెడ్డి, దెబ్బెటి వెంకటేశ్వర్లు, గౌటమ్ సతీష్ , ప్రముఖ న్యాయవాది సంధాని, చుంచు గురువయ్య, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రి ఉత్సవాలకు భూకైలాస్ లోని జ్యోతిర్లింగం ముస్తాబు



తాండూర్ ప్రజా పాలన ప్రతినిధి : తాండూరు నియోజకవర్గంలో శివరాత్రి సందర్భంగా జాతర ఉత్సవాలు జరగడానికి బషీరాబాద్ మండలం లోని లో శివలింగం తాండూర్ లోని భూకైలాస్ లోని జ్యోతిర్లింగం ముస్తాబయ్యాయి ఆలయాలు ముస్తాబయ్యాయి మంగళ బుధ వారాలు జాతరలు చేసుకోవడానికి ఏర్పాట్లు చురుకుగా చేశారు తాండూర్ మండలం లోని అంతరం తండ సమీపంలో జాతర ఉత్సవాలు జరుపు కోవడానికి ఆల్ ఇండియన్ బంజారా సేవా సంఘం నాయకులు శంకర్ నాయక్ పూజలు నిర్వహించారు దుకాణాలు వెలిశాయి కర్ణాటక ప్రాంతం నుండి ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసుకునే విద్యార్థులు భూకైలాస్ ప్రాణానికి చేరుకొని చూసి వెళ్లారు అన్నదాన కార్యక్రమానికి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

## నిండు జీవితానికి రక్షణ రెండు చుక్కలు

### మేకవనంపల్లి సర్పంచ్ పట్లోళ్ళ శశిధర్ రెడ్డి



వికారాబాద్ బ్యూరో 28 ఫిబ్రవరి ప్రజాపాలన : చిన్నారుల నిండు జీవితానికి పోలియో రెండు చుక్కలు వేయించాలని మేకవనంపల్లి సర్పంచ్ పట్లోళ్ళ శశిధర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మోమిన్ పేట్ మండల పరిధిలోని మేకవనంపల్లి గ్రామంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 5 ఏళ్ళలోపు చిన్నారులకు తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలని హితవు పలికారు. పోలియో మహమ్మారి నుండి తమ చిన్నారులను రక్షించుకోవాలంటే విధిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిహెచ్.కృష్ణ, ఎంపిటిసి గోవర్ధన్ రెడ్డి, ఏఎన్ఎం సుజాత, అంగన్ వాడి టీచర్లు లక్ష్మి, సంగీత, ఆశ వర్కర్లు రాజేశ్వరి, లావణ్య, కారోబార్ కుమ్మరి శ్రీనివాస్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



కోరుట్ల, ఫిబ్రవరి 28 (ప్రజాపాలన ప్రతినిధి): కోరుట్ల మండలంలోని మోహన్ రావు పేట గ్రామములో ని జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకల్లో పాఠశాలలోని విద్యార్థులు 100 రకాల సైన్స్ కు సంబంధించిన వివిధ అంశాలను ప్రదర్శించి వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరికేల్ల మల్లారెడ్డి, ఉప సర్పంచ్ బి.రాజేశం, సెక్రెటరీ జి.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు కె.లలిత,జి.మధుసూదన్ రావు ,ఉపాధ్యాయులు, సి.ఆర్పీ లు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 28 ప్రజాబలం ప్రతినిధి: రేపు మహా శివరాత్రి సందర్భంగా ఖానాపూర్ లోని అతి పురాతన మైన ఐ సిద్ద లింగేశ్వర మందిరం లో ఉదయం 7-30 నిమిషాల నుండి మాహ రుద్రబిషెఖము నిర్వహించబడుతుంది..10-30 నిమిషాల నుండి గణపతి హొమము రుద్ర హొామము ఉంటుంది..మధ్యాహ్నం స్వామి వారి కల్యాణము నిర్వహించబడుతుంది.. సాయింత్రము 4గంటల నుండి అర్చన లు అబిషెఖలు రాత్రి 7గంటల వరకు 7-30 నుండి స్వామి వారి ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది..రాత్రి 12 గంటలనుండి లింగోద్భవ కార్యక్రమం 108 కళాశాలతొ అభిషేకము నిర్వహించబడుతుంది... కావున మహా భక్తులు అందరు ఇట్టి కార్యక్రమం లొ పాల్గొని స్వామివారి కృప కు పాత్రలు కావల్సింది ప్రార్ధన..మడుపు వెణుగొపాల్ రావు,

## ఉపాధి కూలీలకు రావల్సిన 4వారాల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి



ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 28 ప్రజాపాలన ప్రతినిధి :సోమవారము రోజు మొగుళ్ళ వంపు గ్రామంలో ఉపాధి కూలీల సమస్యలు తెల్సుకోని వారి తో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా జాయింట్ సెక్రెటరీ పి అంజయ్య మాట్లాడుతూ. ఈ గ్రామంలో 4 వారాలనుండి కూలీ డబ్బులు రాకపోవడం తో తీవ్ర ఇబ్బందులు ఎదురు కొంటున్న కూలీలు . ఎర్రటి ఎండలో 1 గంటలవరకు పనిచేయాలని నిబంధన తీసివేయాలి. ఎండాకాలంలో కూలీలు చేసిన పనికి గవర్నమెంట్ కొంత కలిపి ఇచ్చేవారు ఇది ఇప్పుడు తీసివేస్తూ.జివో తేవడం జరిగింది వెంటనే అట్టి జీవో ను రద్దుచేయాలిపేస్లిప్పులు ఇవ్వాలి స్లిప్పులు ఇవ్వక పోవడంతో రోజు కూలీ ఎంత వస్తుందో తెలియదు ప్రతి సంవత్సరం కూలీలకు రావాల్సిన డబ్బులు కొంత రావడం లేదు అధికారులను అడిగితే సమాదానం ఉండదు వీరి దగ్గర స్లిప్పులు ఉండవు దీనివలన కూలీలు నష్ట పోతున్నారు కాబట్టి వెంటనే స్లిప్పులు ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో 73000 వేల కోట్లు కేటాయించి కూలీలకు తీవ్రమైన అన్యాయం చేసింది. దీన్ని సవరించి ఉపాధి హామీ చట్టానికి 2 లక్షల కోట్లు బడ్జెట్ కేటాయించాలిరోజుకూలి 600 రూపాయలు ఇయ్యాలిసంవత్సరానికి 200 రోజులు కల్పించాలి మేట్లకు పారితోషికం 6 రూపాయలు ఇయ్యాలి10 సంవత్సరాల క్రితం పనిముట్లు ఇచ్చారు నేటికీ మళ్లి ఇవ్వలేదు గడ్డపార తట్ట పార వెంటనే ఇవ్వాలిమెడికల్ కిట్టు అందుబాటులో ఉండాలిపని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలిమండలంలో చాలా గ్రామాలల్లో పనిలేక రోజు వారి అవసరాలు తీరక ఆర్థికంగా కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు వెంటనే అన్ని గ్రామాల్లో పని కల్పించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాము ఈ కార్యక్రమంలో పార్వతమ్మ మంజుల అనిత సుగుణమ్మ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు అనంతరం ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ మరియు ఏ పీ ఓ కు మెమోరాండం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో పి అంజయ్య, బి సత్తనారి, జంగయ్య, చంద్రయ్య, శేఖర్, తదితరులు ఉన్నారు,ఈ రోజు మొగుళ్ళవంపు గ్రామంలో ఉపాధి కూలీలా గ్రామ కమిటీ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా జాయింటు సెక్రెటరీ పిఅంజయ్య, వేయడం జరిగింది అధ్యక్షులు :- ఎన్ మంజులకార్యదర్శి :- కే పార్వతమ్మఉపాధ్యక్షులు :- వెంకటరమణ. సిహెచ్ సుగుణమ్మ సహాయ కార్యదర్శి వై అనిత కమిటీ సభ్యులు :- బి యాదమ్మ. ఎన్ శమంతా. ఎం రాధికా. ఏ పుష్పలత. ఎన్ సాలమ్మా. సిహెచ్ సుజాత. పి చిన్న పద్మ. ఎన్ శైలజ సి హెచ్ పొన్నమ్మ. కే జయమ్మ వై మంజుల.

## రెండు గ్రామాల మధ్య ముదురుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి (నా గాఆలయం) దేవాలయ పరిధి



రాయికల్ , ఫిబ్రవరి 28బీ( ప్రజా పాలన ప్రతినిధి): రాయికల్ మండలం లోని కొత్తపేట గ్రామం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం రెండు గ్రామాల మధ్య ముదురుతున్న ఆలయ పరిది వివాదం, గతంలో కొత్తపేటలో వడ్డెర కాలని ఉండేది .తెలంగాణ ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన తండాలను, కాలనీలను గ్రామ పంచాయతీలుగా చేయడం వలన కొత్తపేట గ్రామం నుండి వడ్డెర కాలనీ వేరు చేయబడి గ్రామ పంచాయతీగా ఏర్పడింది .అప్పటినుండి ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ రాజరాజేశ్వర స్వామి (నాగ ఆలయం )ఆలయం గ్రామ పరిధివివాదం మొదలైంది .వడ్డెర కాలనీ గ్రామం ఆలయ అభివృద్ధిలో మేము సైతం పాలుపంచుకుంటామని, మా గ్రామం పేరు కూడా దేవాలయం బోర్డుపై పెట్టాలని ,వడ్డెర కాలనీ వాసులు ఆలయ బోర్డు పై వడ్డెర కాలని పేరును రాసినట్లు తెలుస్తుంది . మహాశివరాత్రి పర్వదినాన రెండు గ్రామాల మధ్య వివాదం జరగకుండా పెద్దలను , అధికారులు పరిష్కరించాలని,ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.వెంటానే ఈ సమస్య పై అధికారులు స్పందించిఈ ఆలయ పరిధి వివాదంపై అధికారులు స్పందించి ప్రస్తుతం శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం కొత్తపేట గ్రామం పరిధిలోనే ఉంటుందని అధికారుల నుండి ఉత్తర్వులు వచ్చేంత వరకూ కొత్తపేట గ్రామ పరిధిలో నే ఉంటుందని, రాయికల్ తహసిల్దార్ దిలీప్ నాయక్ ,రాయికల్ ఎస్ .ఐ . కిరణ్ కుమార్ గౌడ్ పాల్గొని రెండు గ్రామాల ప్రజలను ఒప్పించారు. ఈ కార్యక్రమంలో ఇరు గ్రామాల సర్పంచులు , వార్డు మెంబర్లు, నాయకులు పాల్గొన్నారు

# రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అర్ధరహితం

### వికారాబాద్ పట్టణ యూత్ వింగ్ సభ్యులు మాలె లక్ష్మణ్



వికారాబాద్ బ్యూరో 28 ఫిబ్రవరి ప్రజాపాలన : టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, చేవెల్ల ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని వికారాబాద్ పట్టణ టిఆర్ఎస్ యూత్ వింగ్ సభ్యులు మాలె లక్ష్మణ్ తీవ్రంగా విమర్శించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ కూడలిలో టిఆర్ఎస్ యూత్ వింగ్ సభ్యులు కౌన్సిలర్ మల్లేపల్లి నవీన్ కుమార్, దీపు, సుభాన్ రెడ్డి, హరితేజ ముదిరాజ్, సుభాష్ ముదిరాజ్, గాండ్ల మల్లికార్జున్, ఫారూఖ్, సిద్దిక్, కొత్రేపల్లి ఇస్మాయిల్ తదితరులతో కలిసి టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి వ్యతిరేక నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లజాస్వామ్య దేశంలో ఎవరికి నచ్చిన వ్యాపారం వారు చేసుకోవడంలో తప్పేమిటని ప్రశ్నించారు. రాష్ట్రాభివృద్ధికి సద్విమర్శలు చేయాలి కానీ వ్యక్తిగత విమర్శలు చేయరాదని ఇంకిత జ్ఞానం కూడా లేదా అని ఘాటుగా స్పందించారు. చేవెల్ల ఎంపి గడ్డం రంజిత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత విమర్శలతో రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తే సహించేదిలేదన్నారు. కొడంగల్ ను సర్వనాశనం చేసి ఇప్పుడు రాష్ట్ర కాంగ్రెస్ ను భ్రష్టు పట్టించే ఆలోచనలో ఉన్నట్లుగా వ్యాఖ్యలు ఉన్నాయని దెప్పిపొడిచారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం



రాయికల్ ,ఫిబ్రవరి 28( ప్రజా పాలన ప్రతినిధి): రాయికల్ మండలం లోని భూపతిపూర్ గ్రామం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గా సైన్స్ ఫెర్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, ఉపసర్పంచ్ అన్న వేణి వేణు సింగిల్విండో చైర్మన్ ముత్యం రెడ్డి ,పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జక్కుల రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు గిరిధర్, శంకరయ్య ,మహేష్ గంగాధర్ ,కార్తీక్ ,శ్రీను , విష్ణు మరియు విద్యార్థిని ,విద్యార్థులు పాల్గొన్నారు .





# వినోబాబావే భూములను పేదలకు పంచాలి



ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 28 ప్రజా పాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలో వినోభా నగర్ జ్ఞాన సరస్వతి పౌండేషన్ ట్రస్ట్ సభ్యులు సదా వెంకటరెడ్డి, వెంకటేష్ మాట్లాడుతూ 5 ఎకరాలు 2005-నుండి ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు ప్రతిభను గుర్తించి వారికి స్పోర్ట్స్ అకాడమీ శిక్షణ ఇవ్వడం కోసం రెగ్యులర్గా యాక్టివిటీస్ చేయించడంలో పని చేస్తున్నాం 1978 భూదాన్ బోర్డు సర్వే నెంబర్ 2/ 26 ఎకరాల 13 గుంటలు అలాంటివి చేయడం జరిగింది. 2012-2015 భూదాన్ బోర్డు రాజేందర్ రెడ్డి వినోబాబావే . జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ కు అప్పగించారంటు వాళ్లు తెలిపారు. కమీషనర్ గారికి మాకు ఉన్న పత్రాలను రెండు రోజుల ముందే అప్పగించాము కమిషనర్ మాకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా షెడ్లను కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని వాళ్ళు అన్నారు. మాకు ఉన్న కరెంటు బిల్లును పాస్ బుక్ డాక్యుమెంట్ 2040 వరకు ప్లీజ్ పత్రాలు అప్పగించారు మా ట్రస్ట్ సభ్యులను హైకోర్టును ఆశ్రయిస్తామనితెలిపారు స్థానిక కౌన్సిలర్స్ మాట్లాడుతూ. భూదాన్ బోర్డు చైర్మన్ రాజేందర్రెడ్డి 2015 సస్పెండ్ చేసిన తర్వాతఎలా చేశారని అప్పటికే ఆయనను సస్పెండ్ చేసింది ప్రభుత్వ%శీ% మీకు ఈ భూమి ఎలా వచ్చిందని వారు ప్రశ్నించారు. సర్వే నెంబర్ 2 లో గల భూమి 26 ఎకరాలు దళితుల పేరు మీద ఉన్నది కాబట్టి అట్టి భూమి పేదలకు దక్కాలని స్థానిక కౌన్సిలర్ లు పేర్కొన్నారు జ్ఞాన సరస్వతి పేరుతోటి మోసపూరితమైన వైఖరి చేస్తున్నారని స్థానికులు తెలిపారు. ఇదిలా ఉండగా ఇబ్రహీంపట్నం చెందిన స్థానిక కీర్తిశేషులైన గాజుల బాలరాజ్ సన్నాఫ్ మల్లయ్య , సర్వే నెంబర్ 2 లో మాకు1982లో ప్లాట్ నెంబర్ 182 పట్టా సర్టిఫికెట్ ప్రభుత్వం ఇచ్చారంటూ రాజుల బాలరాజ్ కుమారుడు గాజుల శ్రీనివాస్ తెలిపారు.


## ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

**బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు**

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| డి. వరప్రసాద్ | తెల్లాపూర్ | 9553999990 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| కళ్యాణ్ సి.ఎం. | కూకట్‌పల్లి | 7842672389 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| టి.రాంబాబు | శేర్లింగంపల్లి | 6301925113 |
| సత్య కిషోర్ | సిద్దిపేట | 6309723472 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492927684 |
| బోడ మమత | జగిత్యాల | 9491127684 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | మయూర్ సెంటర్ | 9160400339 |
| మాలేడు నరేందర్ | ఖమ్మం రూరల్ | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | ఖమ్మం టౌన్ | 9948327333 |
| కోన.నరసింహారావు | మధిర రూరల్ | 9949426541 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్య.శ్రీను | బోనకల్ | 868810293 |
| రత్నకిషోర్ నంద్రు | ఎర్రుపాలెం | 8142196692 |
| సి.మల్లేష్ | ఇబ్రహీపట్నం | 9618028334 |
| భుక్య శ్రీను | బోనకల్ | 86881020885 |
| సాయికృష్ణ | వైరా | 9951486635 |
| పి.పండు | చేవేళ్ల | 9963293635 |
| గొల్లపూడి దశరథన్ | జిల్లేడు, చౌదరిగూడ | 9951334682 |
| పుప్పాల కిరణ్ కుమార్ | రాజేంద్రనగర్ | 9666603538 |


# ఉత్తమమైన సేవలతో ప్రజాదరణ పొందుతున్న వి లవ్ యు ఇంటర్నేషనల్ ఫౌండేషన్ : ఆయుష్ కమిషనర్ అలుగు వర్షిణీ



హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి) :ప్రపంచవ్యాప్తంగా ఉత్తమ సేవలను అందిస్తూ వి లవ్ ఫౌండేషన్ మంచి ప్రజాదరణ పొందుతుందని తెలంగాణ రాష్ట్ర ఆయుష్ కమిషనర్ అలుగు వర్షిణి అన్నారు.సోమవారం బల్కంపేట నేచర్ క్యూర్ ఆయుర్వేదిక్ హాస్పిటల్ లో వి లవ్ యు ఫాండేషన్,జి,హెచ్,ఎమ్ సి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు..దాదాపు 300 మంది వాలంటీర్స్ తో హాస్పిటల్ పరిశుభ్రత లో భాగస్వాములైనందుకు ఫాండేషన్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని సూచించారు. అనంతరం ఫౌండేషన్ తెలంగాణ చైర్మన్ మధు మాట్లాడుతూ... విద్య, వైద్యం తదితర రంగాలలో నిస్వార్ధమైన తల్లి ప్రేమను అందించడంతో పాటు మంచి సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో సౌత్ కొరియాకు చెందిన జాంగ్ గిల్ జా దాదాపు 30 సంవత్సరాల క్రితం ఈ సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించాలని లక్ష్యంతో నేటి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు తమ సంస్థ ద్వారా చేపడతామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమం నేచర్ క్యూర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ భవాని, జిహెచ్ఎంసి , ఏ ఎమ్ హెచ్ ఓ భాస్కర్ నారాయణ, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఖాకీల తప్పిదం వడ్డేపల్లి సాయికిరణ్ కుటుంబానికి న్యాయం జరగాలి: ఎమ్మార్పీఎస్ డిమాండ్



జగిత్యాల, ఫిబ్రవరి 27 (ప్రజాపాలన ప్రతినిధి): మల్యాల మండల్ తక్కళ్లపల్లి గ్రామంలో గత ఏడాదినర క్రితం వడ్డేపల్లి సాయికిరణ్ అనే యువకుడిని పేకాట ఆడుతున్నారనే నెపంతో పెగడపల్లి మహిళ ఎస్ఐ సాయికిరణ్ ను కొడుతూ పేకాట ఆడుతున్నవంటు ఊరు నడి మధ్యలో బట్టలు ఊడదీసి కొట్టడం వలన అవమానం భరించలేక సాయికిరణ్ అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారులకు బాధితుని తండ్రి దరఖాస్తు మేరకు మహిళ ఎస్సైపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగింది. సాయికిరణ్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని అప్పుడు ఉన్నటువంటి మల్యాల సిఐ మరియు డిఎస్పీ పోలీసు ఉన్నతాధికారులు హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు సంవత్సరంనర గడుస్తున్న ఆ కుటుంబానికి ఎలాంటి న్యాయం జరగడంలేదని ఈ విషయంపై ప్రజా ప్రతినిధులు పోలీసు ఉన్నతాధికారులు పలుమార్లు ఆ కుటుంబానికి న్యాయం చేస్తాం అంటు డి.ఎస్పి ఆఫీస్ చుట్టూ మల్యాల పోలీస్ స్టేషన్ చుట్టూ తింపుకుంటున్నారని మరియు మీరు కాంప్రమైజ్ కావాలని పోలీసు అధికారులు మధ్యవర్తుల ద్వారా రాజకీయానికి ప్రయత్నిస్తున్నారనీ బాధితులు ఎమ్మార్పీఎస్ నాయకులతో గోడు వెలుబుచ్చుకున్నారు. జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దుమాల గంగారాం మాదిగ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఆ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ఎమ్మార్పీఎస్ పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని మహిళ ఎస్సైపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు మా పోరాటం ఆగదని బాధిత కుటుంబానికి 20 లక్షలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా పక్షాన డిమాండ్ చేస్తున్నామని లేని యెడల మందకృష్ణ మాదిగ దృష్టికి తీసుకెళ్లి జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని పోలీసులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్ మాదిగ ఎమ్మార్పీఎస్ యువసేన జిల్లా ఇన్చార్జి బొల్లె అనిల్ మాదిగ మల్యాల మండల అధ్యక్షులు ముప్పారం రామస్వామి మాదిగ కట్కూరి కర్ణాకర్ మాదిగ సురుగు శ్రీను మాదిగ బొల్లె అనిల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైంది: భట్టి విక్రమార్క



పాలేరు పిబ్రవరి 28 ప్రజాపాలన ప్రతినిధి :ఖమ్మం ముదిగొండవరి వేస్తే ఉరి అన్న కెసిఆర్ రైతులు ప్రత్యామ్నాయ పంటలవేపు వేస్తే నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోయారు. దీనికి ప్రభుత్వమే భాద్యత వహించాలి...గతంలో రైతులకఉ పావలా వడ్డీకే రుణాలు ఇచ్చేది కానీ ఈ ప్రభుత్వం వచ్చాక రుణాలు ఇవ్వలేదు...ఎరువుల ధరలను ప్రభుత్వం విపరీతంగా పెంచడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు... ప్రత్యేక తెలంగాణ కోసం అనేక ఉద్యమాలు చేసిన మాకు పాత ఫెన్సన్ విధానాన్ని అమలు చేయాలి...ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్ కు 1500 కోట్ల ఇస్తే. వేలాది ఎకరాలకు సాగు నీరు అందేది కానీ ఈ ప్రభుత్వం సీతా రామ ప్రాజెక్ట్ పేరుతో 25 వేల కోట్లు వెచ్చించి నప్పటికీ ఇంతవరకు చుక్క నీరు లేదు... ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయకు లెక్క చెప్పాలి.. ఈ పాదయాత్ర పీపుల్స్ మార్చ్ (పాదయాత్ర) మదిర నియోజకవర్గంలో పూర్తి చేసి సిఎల్పీ నాయకుడిగా రాష్ట్రంలోని అన్ని మండలాలు తిరుగి ప్రజా సమస్యలు తెల్సుకుంటా ఏ లక్ష్యం కోసం తెలంగాణ సాధించుకున్నామో అది నెరవేరలేదు. అది కొద్ది మందికే ఉపయోగపడుతుంది.తెలంగాణాలో సృష్టించే సంపద ఏమై పోతుంది.? ఈ పాలన మారాలి సంపద ఇక్కడి ప్రజలకు చెందాలి..నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిసిన వ్యక్తిగా ఇక్కడి సంపద ప్రజలకు అందే వరకు పోరాటం సాగిస్తా... గోకినేపల్లి సమీపంలోని మామిడి తోటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఎల్పీ నేత భట్టి విక్రమార్క పాల్గొన్నరు ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్,రాయల నాగేశ్వరరావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య,మల్లెల అజయ్.

# మరణించిన పసుల బాలు కుటుంబాన్ని కలిసి పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన మర్రి నిరంజన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 28 ప్రజాపాలన ప్రతినిధి : ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలం కాగజ్ ఘాట్ గ్రామంలో నిన్న రాత్రి ఆగపల్లి గేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మరణించిన కాగజ్ ఘాట్ గ్రామ యువకుడు పసుల.బాలు యొక్క పార్థివ దేహానికి పూల మాలవేసి,కుటుంబ సభ్యులను ఓదార్చి,11000 రూపాయలు ఆర్థిక సాయం చేసి,చేతికి వచ్చిన కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లడం,కుటుంబానికి ఆసర గా ఉండాల్సిన సమయంలో ఇలా ఆక్సిడెంట్ రూపం లో బలికావడం ఆ కుటుంబానికి తీరని లోటు అని లిఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి.నిరంజన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అండాలు వెంకటేష్ , మంచాల మండలం కో ఆప్షన్ మెంబెర్ వాజీద్ ,గ్రామ ఉప సర్పంచ్ ఐలయ్య గారు, డైరెక్టర్ రమేష్ గారు, జంగయ్య ,ధన్ రాజు,రవి,వెంకట నరసింహా రెడ్డి, కృష్ణ,రజినీకాంత్ గౌడ్,చక్రి మరియు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు,%వీచీ=% టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం



మేడిపల్లి, ఫిబ్రవరి 28 (ప్రజాపాలన ప్రతినిధి): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పాత రామంతాపూర్ శివాలయంలో ఆలయ చైర్మన్ మోత్కూరి దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మరియు ఉప్పల్లోని శ్రీ శ్రీ శ్రీ శివ శంకర మహమ్మాయి దేవాలయంలో బల్వంత్ ఆచారి ఆధ్వర్యంలో ఘనంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రామంతపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు బండారు వెంకట్ రావు, వేముల తిరుపతయ్య, సంకూరీ కుమారస్వామి పాల్గొన్నారు.

# లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ భారతి హోళ్ళికేరి**



మంచిర్యాల బ్యూరో, ఫిబ్రవరి 28, ప్రజాపాలన :దళితుల అభివృద్ధి, ఆర్థిక అభ్యున్నతి కోసం దళిత బంధు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భారతి హెూళికేరి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్హాల్లో మంచిర్యాల శానసభ్యులు నడిపెల్లి దివాకర్ రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దళితులు ఆర్థికంగా ఎదగడం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి నియోజకవర్గంలో 100 మంది లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రయోగాత్మకంగా చేపట్టడం జరిగిందని తెలిపారు. దళితుల ఆర్థికాభివృద్ధి, సమాజంలో పరివర్తన, మార్పు, పేద కుటుంబాల అభ్యున్నతి ఆశయంగా ప్రభుత్వం మహెూన్నత కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. చిత్తశుద్ధితో పని చేసుకొని విజయవంతమై సమాజంలో ఉన్నత స్థానంలో నిలిచేందుకు మంచి అవకాశమని తెలిపారు. దళితబంధు పథకంలో బ్యాంక్ లింకేజీలో వివిధ పథకాలు ఉంటాయని, లబ్దిదారులు ఎంపిక చేసుకున్న యూనిట్ల ఆధారంగా నిధులు వారి ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎలాంటి నిబంధనలు లేకుండా వచ్చిన పని, నచ్చిన పని చేసుకునేందుకు వీలుగా యూనిట్లను ఎంపిక చేసుకొని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, 10 లక్షల రూపాయలకు మించకుండా యూనిట్ల ఎంపిక ఉండాలని, ఇందులో 9 లక్షల 90 వేల రూపాయలు యూనిట్కు, 10 వేల రూపాయలు దళిత రక్షణ నిధికి జమ చేస్తారని అన్నారు. ఆసక్తి ఉన్న వారు ఉమ్మడిగా కూడా యూనిట్ను ఎంపిక చేసుకొని పథకాన్ని వినియోగిం చుకోవ చ్చని తెలిపారు. యూనిట్లు గ్రౌండ్ అయ్యేంత వరకు అవగాహన కల్పించడం జరుగుతుందని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి కొరకు ప్రభుత్వం మహత్తరమైన పథకం చేపట్టిందని, నియోజకవర్గంలో హాజీపూర్ మండలం పడనపల్లి, లక్షెట్టిపేట మండలం రంగంపేట, దండేపల్లి మండలం వెల్గనూరు గ్రామాలను దళితబంధు కార్యక్రమానికి ఎంపిక చేయడం జరిగిందని, ప్రయోగాత్మకంగా లబ్దిదారులు వారికి అనుకూలమైన యూనిట్ను ఎంపిక చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. దళారుల బారిన పడకుండా ఏ ఒక్కరికి డబ్బులు ఇవ్వకూడదని, పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్.సి. కార్పొరేషన్ ఈ.డి. దుర్గాప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ శివ చేతుల మీదగా డ్రమ్ములు పంపిణీ..



ఏన్కూరు, ఫిబ్రవరి 28 (ప్రజాపాలన న్యూస్): ఏన్కూరు మండలంలోని హిమామ్ నగర్ గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ భూక్య శివ చేతుల మీదగా సోమవారం డ్రమ్ములు పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ పరిధిలోని రాజులపాలెం గ్రామంలో వాటర్ షెడ్ ఆర్గనైజేషన్ ట్రస్ట్ సంస్థ ద్వారా రైతులకు సేంద్రియ ఎరువులు, ఆర్గానిక్ మందులు ఎలా తయారు చేయాలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రస్టు ద్వారా ఒక్కొక్క రైతుకి 300 రూపాయలకు డ్రమ్ములు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వాటర్ షెడ్ ఆర్గనైజేషన్ ట్రస్టు సంస్థ ఉద్యోగులు నాగరాజు, కృష్ణ, వార్డు సభ్యులు ధరావత్ మీనా, మొగిలి చంద్రకళ, గ్రామ రైతులు వాంకుడోత్ కిషన్, ధరావతు లచ్చు, బాలు, భూక్య హరిలాల్, వాంకుడోత్ మోహన్, ధరావతు శ్రీను, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మాతా, శిశు సంక్షేమ వైద్య శాల ప్రారంభానికి సిద్దం

**జిల్లా కలెక్టర్ భారతి హెూళ్ళికేరి**



మంచిర్యాల బ్యూరో, ఫిబ్రవరి 28, ప్రజాపాలన :జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో ఏర్పాటు చేసిన మాతా, శిశు సంక్షేమ వైద్యశాల ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ భారతి హెూళికేరి అన్నారు. సోమవారం మంచిర్యాల శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్రావు, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు డా? అరవింద్ తో కలిసి మాతా, శిశు సంక్షేమ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య సేవలను మరింత మెరుగుపరిచే దిశగా జిల్లాలో ఏర్పాటు చేసిన మాతా, శిశు సంక్షేమ వైద్యశాల సిద్ధమైందని తెలిపారు. ఆసుపత్రిలో మౌళిక సదుపాయాలు, ల్యాబ్, వివిధ వార్డులు, ఆపరేషన్ థియేటర్ పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లాలో 100 పడకల ఆసుపత్రి సిద్ధంగా ఉందని, త్వరలోనే ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెంట రాజయ్య, టి.ఎన్.ఎం.ఐ.డి.సి. ఎన్.ఈ. దేవేందర్ కుమార్, రోడ్డు భవనాల శాఖ ఈ. ఈ. రాము, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..



బిఎన్.రాములు

## మార్పులు

ఇలా దశాబ్దాల పరిణామంలో నగరాలు, పట్టణాలు అభివృద్ధికి సంకేతమైనా అవి అందరికి ఉపాధిని గానీ, జీవన ప్రమాణాలు గానీ, స్థిర నివాసాన్ని గానీ, జీవన భద్రత గానీ అందించలేకపోయాయి. ఈ సమస్య ప్రపంచవ్యాప్తంగా ఇలాగే కొనసాగుతున్నది. బిల్‌గేట్స్ వంటి వందకు పైగా మల్టీ బిలియనీర్లకు మేనేజ్‌మెంటు గురువుగా ఉండిన పద్మభూషణ్ కీ.శే. సి.కె. ప్రహ్లాద్ అనే అమెరికన్ 'ఫార్చ్యూన్స్ ఎట్ ది బాటమ్ ఆఫ్ పిరమిడ్' అనే అద్భుతమైన, అపూర్వమైన గ్రంథాన్ని రాశారు. అందులో ప్రపంచ దేశాల్లోని అభివృద్ధి పరిణామాలను, మార్కెటింగ్ విస్తరణ అవకాశాలను, పేదలకు ఆధునిక సరుకులను, వస్తు సేవలను అందిస్తూ పారిశ్రామికవేత్తలు ఎలా ఎదగవచ్చో వివరించారు. తన తుది విశ్లేషణలో ఒక గొప్ప మాట అంటారు. గత రెండువందల సంవత్సరాలుగా సాగుతున్న ఆధునిక పారిశ్రామిక సైన్స్ టెక్నాలజీ ఆవిష్కరణలు, ఉత్పత్తులు, మార్కెటింగ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, వాటి నాణ్యత ప్రమాణాలు, దృక్పథాలు మొదలైనవన్నీ ఇప్పటిదాకా మూడింట ఒకవంతు ప్రజలకు మాత్రమే అందుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా మూడింట రెండువంతుల ప్రజలు ఈ అభివృద్ధికి వెలుపలనే ఉండిపోతూ, వాటి బాధితులుగా మిగిలిపోతున్నారు. ఆరువందల కోట్ల జనాభాలో రెండువందల కోట్లు అభివృద్ధిని అందుకుంటూ, నాలుగువందల కోట్ల జనాభా ఈ అభివృద్ధికి వెలుపల మిగిలిపోతున్నారు. ఇదే మార్కెటింగ్, ఇవే దృక్పథాలు, ఇవే నాణ్యతా ప్రమాణాలు, వస్తుసేవల ఉత్పత్తి కొనసాగితే ఈ నిష్పత్తి ఇలాగే కొనసాగుతూ మూడింట రెండు వంతుల జనాభా మురికివాడల్లో, అభివృద్ధికి వెలుపల బతుకుతుంటారు అని విశ్లేషిస్తూ ఈ నాలుగువందల కోట్ల ప్రజలకోసం నాణ్యత ప్రమాణాలను, మార్కెటింగ్ వ్యవస్థలను, దృక్పథాలను పునర్నిర్మించుకోవాలి. అట్టడుగు వర్గాల కోసం ఉత్పత్తి చేసినపుడు లాభం తక్కువ వచ్చినా టర్నోవర్ రెండు రెట్లు ఉండడంవల్ల లాభాలు ఎక్కువవుతాయి అని నిర్ధారించారు.

ఇలా గత రెండువందల సంవత్సరాలుగా సాగిన అభివృద్ధి మనదేశంలో కుల వ్యవస్థలో ఆధిక్యతలో ఉన్నవారికి ఎక్కువగా అందింది. మిగతా కులాలు వెనుకబడిపోతూ వచ్చాయి. అమెరికాలో గత కొన్ని దశాబ్దాలుగా జరిగిన అభివృద్ధిలో మల్టీ మిలియనీర్, బిలియనీర్లు 75 శాతం తొలితరం నుండి ఎదిగినవారే. ఇండియాలో ఇది సాధ్యం కాలేదు. తొలితరం నుండి ఎదిగిన 25 శాతం కూడా ఆయా కులాధిక్యత గల సామాజిక వర్గాలనుండి ఎదిగినవారే కావడం విషాదం. దీనికి మరో మార్గం లేదా? ఇలా ఆలోచిస్తూ అనేక అభివృద్ధి నమూనాలను ఆయా దేశాల చరిత్రను, పరిణామాలను పరిశీలిస్తూ రావడం జరిగింది. సి.కె. ప్రహ్లాద్ వంటి ఎందరో ఈ పరిశీలనలను చేశారు. సోవియట్ యూనియన్, చైనా కమ్యూన్ వంటి అభివృద్ధి నమూనాలను పరిశీలించి ఇండియాలో జిల్లా పరిషత్, స్థానిక అభివృద్ధి సంస్థలు, వ్యవస్థలు ఏర్పాటు చేయడం జరిగింది. అది కూడా ఆయా కులాధిక్య సామాజిక వర్గాల ఎదుగుదలకు, ఆధిపత్యానికి పరిమితమయ్యాయి. రిజర్వేషన్ల ద్వారా మహిళలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు కొంతమేరకు వీటిని అందుకోగలుగు తున్నారు. అయితే ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో స్వయం నిర్ణాయక స్థానాల్లోకి గానీ, పాలసీ నిర్ణాయక స్థానాల్లో గానీ, ఇంకా పూర్తిగా ఎదగడం జరగలేదు. అందువల్ల ఆధిపత్య సామాజిక వర్గాలు ఆమోదించిన మేరకు, వారి ప్రయోజనాలు దెబ్బ తినకుండా ఉండేవిధంగా మిగతా సామాజిక వర్గాలు ఎదగడానికి ప్రణాళికలు వేస్తూ వచ్చారు. ఇలా ఎప్పటికీ అసమానతలు పెరుగుతూ వస్తున్నాయి.

పదో తరగతి చదువుతున్నప్పుడు నాకు పెళ్ళి సంబంధం గురించి ఒకరోజు ఉదయం మా పక్కవీధిలోని కస్తూరి బుచ్చిరాజం పట్వారీ మా ఇంటికి వచ్చాడు. బేతి రాజయ్య అంటూ పిలిచాడు. మా ఎదురింటి అవతల కాళీ స్థలంలో కుంటాల ఇంటిపేరు గలవాళ్ళు గుడిసె వేసుకుని ఉండేవాళ్ళు. వాళ్ళు బుచ్చిరాజం ద్వారా అవతలి సందులో ముప్పై రూపాయలకు ఒక గుంట చొప్పున మూడు గుంటల స్థలం తీసుకున్నారు. అదే కాలంలో అనుమండ్ల స్వామి కూడా ఆ పక్కనే మూడు గుంటల స్థలం తీసుకున్నాడు. అలాంటిదేదో బేరం గురించి వచ్చాడని అనుకున్నాను.

(మిగతాభాగం రేపటి సంచికలో..)

## గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలకు పూర్తియైన ఘాట్

**బాదం పల్లి హనుమాన్ దేవస్థానం పూజారి ముదాం అశోక్**



జన్నారం రూరల్, ఫిబ్రవరి 28, ప్రజా పాలన: మండల బాదంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు కాశెట్టి లక్ష్మణ్ ఆధ్వర్యంలో హనుమాన్ దేవస్థానం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలకు ఘాట్ పూర్తి అయిందని భాదంపల్లి గ్రామ పూజారి ముదాం అశోక్ అన్నారు, ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ కోవిడ్ నిబమదనాలు పాటిస్తూ.... ప్రతి సంవత్సరం బాదం పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు గ్రామ ప్రతినిధుల సమక్షంలో మహాశివరాత్రి ఉత్సవాలకు గ్రామ కమిటీ సొంత డబ్బులతో బాధ్యత తీసుకొని స్త్రీలకు స్నానాల గదులు వేరుగా ఏర్పాటు చేసి అదేవిధంగా వృద్ధులకు గోదావరి నీటి తో నల్ల లు పూర్తిచేశామని జరపడం జరుగుతుందని ఆయన అన్నారు, మండలంలో మహా శివరాత్రి ఉత్సవాలకు ఆ గ్రామ కమిటీ అదర్యంలో అన్ని గాట్ లను పూర్తి చేశామని తెలిపారు, ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కాశెట్టి లక్ష్మణ్, బాదం పల్లి సర్పంచ్ వాలా అశోక్ రావు, ఉప సర్పంచ్ శీపతి ఆనందం, కార్రోభార్ బైరీ లచ్చన్న, సామల్లా లక్ష్మీరాజం, ముదాం రవి, గ్రామ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 150 ఫిర్యాదుల వెల్లువ

**ఆర్డీఓ లు విజయకుమారి, అశోక్ కుమార్**



వికారాబాద్ బ్యూరో 28 ఫిబ్రవరి ప్రజాపాలన : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ప్రజావాణికి వచ్చే సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని వికారాబాద్ ఆర్డిఓ విజయకుమారి, తాండూర్ ఆర్డిఓ అశోక్ కుమార్ జిల్లా లోని తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశపు హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై (150) ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని వారు తెలిపారు. ప్రజలకు సంబంధించిన ధరణి, డబుల్ బెడ్రూమ్, దళిత బందు, కొత్త రేషన్ కార్డుల మంజూరు, దరఖాస్తు, ఎస్సీ కార్పొరేషన్ లోను, కల్యాణ లక్ష్మి తదితర సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. వికారాబాద్ ఆర్డిఓ విజయకుమారి, తాండూర్ ఆర్డిఓ అశోక్ కుమార్ లు ప్రజావాణిలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ధరణి సమస్యల పరిష్కారం కొసం తహసీల్దార్లు సత్వర చర్యలు చేపట్టి ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.ఇతర సమస్యలను సంబంధిత శాఖల అధికారుల ద్వారా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్, కలెక్టరేట్ ఏ.ఓ. హరిత అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా బంధు యాప్‌ను ఉపయోగించుకోవాలి



తాండూర్ ప్రజా పాలన ప్రతినిధి: ప్రజా బంధు యాప్న శాసనసభ్యులు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు ప్రజా సమస్యలను యాప్ లో తెలియజేస్తే అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారని ఆ లేనిపక్షంలో తాను జోక్యం చేసుకొని ప్రజా సమస్యలను ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని శాసనసభ్యులు పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు ఆదివారం రోజు పాండు ఆర్యవైశ్య మండపంలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రజాబంధు యాప్న తయారు చేసి రోజు ప్రారంభిస్తున్నామని తెలిపారు ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రజా ప్రతినిధులు వాలెంటర్లు గా పనిచేసి వారి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో చేసుకుని ధృవీకరించే విషయాలను వారు అవగాహన కల్పించారు ప్రజా సమస్యలను తెలియజేసి అందుకు ప్రజలు యాప్ ను నేర్చుకోవాలని తెలిపారు వినియోగించుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మధిర శ్రీ చైతన్యస్కూల్ నందు ఘనంగా జాతీయ సైన్స్ డే వేడుకలు



మధిర ఫిబ్రవరి 28 ప్రజా పాలన ప్రతినిధి మధిర మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నాడు %సశీ% జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శ్రీ చైతన్య స్కూల్ సైన్స్ ఉపాధ్యాయులు శ్రీ గుడెల్లి నరేష్, ఎస్కే షాజహాన్, ఆకుల అశోక్, తిరుపతి రావు, ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు సైన్సు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు సైన్స్ ప్రాజెక్ట్ లు నిర్వహించి బహుమతులు అందజేయడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి ఆకెళ్ళ భారతి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ మూఢనమ్మకాలు పారద్రోలుతూ అందరూ సైన్స్ పట్ల నమ్మకం విశ్వాసం కలిగి ఉన్నట్లయితే చక్కని అభివృద్ధి సాధించవచ్చు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ వై. నవీన్ కుమార్ ఏజీఎం చేతన్ ,అకాడమిక్ కోఆర్డినేటర్ నాగేంద్ర ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## కుల, మత విభేదాలు లేకుండా అందరూ కలిసి మెలిసి ఉండాలి



ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి28( ప్రజా పాలన ప్రతినిధి ): మండలంలోని బర్దిపూర్ గ్రామ పంచాయతీ వద్ద పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు ఇట్టి కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ లపై జరిగే సాంఘిక దురాచారాలు అసమానతలు అంటరానితనం అస్పృశ్యత వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు తాసిల్దార్ మాహేశ్వర్ పైఅంశాలపై మాట్లాడుతూ అందరూ సమానమే అని కుల విబేధాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని తెలిపారు అలాగే గ్రామంలో గల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో కుల బహిష్కర కుల వివక్ష లాంటి ఎలాంటి లా అండ్ ఆర్డర్ సమస్యలు వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మాహేశ్వర్, ఎస్సై ఉమాసాగర్ సర్పంచ్ సంగం సాగర్, ఆర్ ఐ భూమేశ్, హెచ్ డబ్ల్యూ ఓ మానస,పంచాయతీ కార్యదర్శి వినయ్ స్కూల్ హెచ్ఎం రమేష్, విఆర్వో రాజయ్య అంబేద్కర్ సంఘం సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు అనంతరం తహశీల్దార్ బర్తిపూర్ మరియు వేములకుర్తి స్కూల్ లలో జరుగుతున్న సైన్స్ ఫేర్ ను సందర్శించి అక్కడ ప్రదర్శించిన ప్రయోగాల గురించి విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగినారు మరియు వివరాలు తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ జజల భీమేశ్వరీ ఎంపీడీఓ ప్రభు సర్పంచులు సాగర్ ,సున్నం నవ్యశ్రీ ,జజల జగన్ సున్నం సత్యం పాల్గొన్నారు.

## బీద కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక సహాయం...



బీరుపూర్, ఫిబ్రవరి 28 (ప్రజాపాలన ప్రతినిధి): బీరుపూర్ మండల్ తుంగూర్ గ్రామంలో ఎస్సి కాలనిలో మానవ హక్కులు విధులు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం కాలనికి చెందిన మైస గంగారెడ్డి గత వారం రోజుల క్రితం కిడ్నిల వ్యాధితో మరణించడంతో అతనికి భార్య భారతి కూతురు కుమారుడు తల్లి ఉన్నారు. నిరుపేద కూలీ కుటుంబం అయిన వారికి కర్చుల నిమిత్తం సర్పంచ్ గుడిసే శ్రీమతిజితేందర్ యాదవ్ 5 వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మసర్థి రమేష్ ఎంపీటీసీ అడేపు మల్లీశ్వరితిరుపతి ఆర్ఐ శ్రీనివాస్ విఆర్ఏ పూడూరి మల్లేష్ ఉప సర్పంచ్ పూడూరి రమేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే ఏదైనా సాధించవచ్చు అని నిరూపించిన మహంకాళి చంద్రశేఖర్



మధిర ఫిబ్రవరి 28 ప్రజా పాలన ప్రతినిధిమధిర వాస్తవ్యులు మహంకాళి శ్రీనివాసరావు కుమారుడు మహంకాళి చంద్రశేఖర రావు బెంగుళూరులోని ఇస్రో లో ఆయన శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు యు ఆర్ రావు సాటిలైట్ సెంటర్లో పదేళ్లుగా సాటిలైట్ బెస్ట్ నావిగేషన్ సిస్టం లో పనిచేసిన ఆయన ప్రస్తుతం స్పేస్ డి బ్రైట్ లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు పదో తరగతి వరకు మధిరలో చదివి చంద్రశేఖర్ ఇంటర్మీడియట్ ఖమ్మంలో పూర్తిచేశారు ఎగ్జిక్యూటివ్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు వెంటనే పూణేలో డిఫెన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ టెక్నాలజీ లో ఎంటెక్లో ప్రవేశం పొంది రెండు నెలల్లోనే బెంగళూరులోని ఇస్రో సైంటిస్ట్ గా విధుల్లో మహంకాళి చంద్రశేఖర రావు మాట్లాడుతూ ఇదంతా కూడా కేవలం నాన్న మహంకాళి శ్రీనివాసరావు ప్రోత్సాహంతోనే సైంటిస్ట్ అయ్యానని తెలిపారు.

## వివాహ వేడుకల్లో వధువుకి మంగళసూత్రం ప్రధానం చేసిన సర్పంచ్ శివ నాగ కుమారి



మధిర ఫిబ్రవరి 28 ప్రజాపాలన ప్రతినిధి : వ ా ట ూ ా ర ు ే ప ట గ్రామంలో పెళ్లి కానుకగా పసుపు, కుంకుమతో పాటు మంగళసూత్రం ప్రధానం చేసి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన సర్పంచ్... రావూరి శివనాగకుమారిపేదింటి ఆడపిల్లకు ఆడపడుచుల అండగా ఉంటాను అంటున్న సర్పంచ్‌లిఒక కుటుంబం ఏర్పడటంలో ప్రధానమైన అంశం పెళ్లి.వివాహం అనే వేడుకలో వరుడు వధువుకి మంగళ సూత్రం అనే పసుపు తాడును మాంగల్య ధారణ చేయడంతో వారి బంధం భార్య భర్తల బంధంగా ఏర్పడి కుటుంబ వ్యవస్థ అవుతుంది.హిందూ సాంప్రదాయాలలో మంగళసూత్రానికి అంతటి ప్రాధాన్యత ఉంటుంది. భారతీయ సంప్రదాయాలలో ఎన్నో సంవత్సరాలుగా ఈ ఆచారం ఉంది. ఈ మహోన్నతమైన సాంప్రదాయాన్ని మండల పరిధిలోని మాటూరుపేట గ్రామ సర్పంచ్ రావూరి శివనాగకుమారి గ్రామంలో లో హిందూ వివాహ సంప్రదాయాన్ని గుర్తుచేస్తూ ఈ రోజు నూతనంగా పెళ్లి చేసుకుంటున్న బొల్లేదు శ్రీనివాస్–శాన్విక జంటకు మంగళసూత్రం ప్రధానం చేసి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు.పెళ్లి బృందం మేళతాళాలతో సర్పంచ్ ఇంటికి వచ్చి పసుపు,కుంకుమతో పాటు పెళ్ళికానుక మంగళసూత్రాన్ని సాంప్రదాయబద్ధంగా పెళ్లి పెద్దల మధ్య సర్పంచ్ కుమార్తె చేతుల మీదగాఅందజేశారు.

## మిలీనియం టాలెంట్ హై స్కూల్ లో ఘనంగా సైన్స్ సంబరాలు




మధిర ఫిబ్రవరి 28 ప్రజా పాలన ప్రతినిధి :మధిర వంున్సిపాలిటీ ప ిరిధి, లో సోమవారం నాడు విులీనియ ం టాలెంట్ హై స్కూల్ నేషనల్ సైన్స్ డే కార్యక్రమము ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమము మిలీనియం టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీల్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ముఖ్యఅతిథిగా సుశీల జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్. ఎం నరసింహారావు పాల్గొన్నారు. భారతరత్న నోబెల్ బహుమతి గ్రహీత సి వి రామన్ గారు ఫిబ్రవరి 28 న రామన్ ఎఫెక్ట్ కనుగొని శాస్త్ర ప్రపంచాన్ని అబ్బుర పరిచారు అని చెప్పారు. విద్యార్థులు సివి రామన్ ని ఎంతో ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేశారు. విద్యార్థులు చేసినటువంటి ఇ ఎక్స్పిరిమెంట్స్ అబ్బుర పరిచే విధంగా ఉన్నాయని అభినందించారు. ఈ కార్యక్రమంలో సుశీల జూనియర్ కాలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పరుచూరి హరినాథ్ మిలీనియం టాలెంట్ స్కూల్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాల జాతీయ సైన్స్ దినోత్సవం



మధిర ఫిబ్రవరి 28 ప్రజా పాలన ప్రతినిధి :న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాల జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు సి.వి.రామన్ కనుగొన్న టువంటి రామన్ ఎఫెక్ట్ మరియు సైన్స్ యొక్క ప్రాధాన్యత గురించి వివరించడం జరిగింది పాఠశాల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా కొన్ని ప్రయోగాలను ప్రదర్శించి సైన్స్ పట్ల ఆసక్తిని కనబరిచారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్. పి. భూమేష్ రావు గారు మాట్లాడుతూ మానవుని దైనందిన జీవితంలో ప్రతి విషయం సైన్స్ తోనే ముడిపడి ఉందని సైన్స్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహనను కలిగి ఉండి నూతన ఆవిష్కరణల దిశగా మీ ఆలోచనలు మార్చాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ డా. పి. భూమేష్ రావు ప్రిన్సిపాల్ షాజీమాథ్యూ కాలేజ్ కో ఆర్డినేటర్ మల్లికార్జున ఏ.ఓ నరసింహారావు ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు



# హీరోయిన్ కాకపోతే ఆ యాప్ అంతు చూసేదాన్ని!



సోషల్ మీడియాలో శ్రుతిహాసన్ చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఇన్ స్టా..ట్విటర్ ద్వారా అభిమానులకు టచ్ లో ఉంటుంది. సినిమా విషయాలతో పాటు..వ్యక్తిగత విషయాల్ని సైతం షేర్ చేస్తుంటుంది. తండ్రి కమల్ హాసన్ లానే సాంకేతికంగాను ఎక్కువ విషయాలు తెలుసుకోవడానికి ఆరాటపడుతుంది.వీలైనంత అడ్వాన్స్ డ్ గా ఉండటానికి ప్రయత్నిస్తుంది. అయితే ఈ బ్యూటీ హీరోయిన్ అవ్వడం వల్ల ఓ యాప్ బ్రతికి బట్టకట్టింది. లేదంటే ఆ యాప్ సంగతేంటో తెల్చేసేదాన్ని అని శ్రుతిహాసన్ అంటోంది. ఇంతకీ ఆ యాప్ ఏంటి? ఆ యాప్ పై శ్రుతి హాసన్ అంతగా ఎందుకు ఆసక్తి చూపిస్తుందో తెలియాలంటే అసలు సంగతి లోకి వెళ్లాల్సిందే.అదే డేటింగ్ యాప్స్ . ఈ యాప్ పీచర్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పెళ్లికాని యువతీ..యువకులు ఈ యాప్ ని ఓ రేంజ్ లో వినియోగిస్తున్నారు. తమ సరదాలన్నింటిని డేటింగ్ యాప్స్ తీరుస్తున్నాయి. కొందరికి మంచి టైంపాస్ యాప్ కూడా.అయితే అన్ని యాప్ లని విచ్చలవిడిగా వినియోగిస్తున్నా..శ్రుతి హాసన్ డేటింగ్ యాప్ ని మాత్రం వాడలేకపోతుందిట. తన స్నేహితులు డేటింగ్ యాప్ ని వాడుతున్నారు. ఎడమ..కుడివైపులకు స్వైప్ చేస్తూ..వ్యక్తుల్ని తిరస్కరించడం..అంగీకరించడం చేస్తున్నారు. బ్లయిండ్ డేట్స్ కూడా వెళ్తున్నారు. కానీ నేను మాత్రం ఆ పనిచేయలేకపోతున్నా.నేను సెలబ్రిటీని కావడం వల్ల ఇన్ని తిప్పలు వచ్చాయి. లేదంటే నేను కూడా వాళ్లలా ఎంచక్కా అన్నిరకాల మూవ్ మెంట్స్ ఆస్వాదించేదాన్ని. హీరోయిన్ గా పెద్దగా ఫేమస్ కాకపోయినా డేటింగ్ యాప్ ని వాడేదాన్ని . కానీ నేను ఇలాంటి యాప్ ల్లోకి ఎంటర్ అయితే ఎలా ఉంటుందో కూడా తెలుసు.అందుకే ధైర్యం చేయలేకపోతున్నా. అయితే ఇలాంటి యాప్ ల్ని కొంత వరకే పరిమితం చేస్తా. తొలుత నమ్మను. కేవలం టైంపాస్ కోసమే వినియోగించేదాన్ని. అయినా ఓసారి ఫేక్ అకౌంట్ పెట్టి ట్రై చేస్తానని తెలిపింది.ఇక శ్రుతిహాసన్ సినిమాల విషయానికి వస్తే నటిగా ఫుల్ బిజీగా ఉంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సరసన సలార్ లో నటిస్తోంది. శ్రుతిహాసన్ తొలి పాన్ ఇండియా చిత్రమిది. ఇప్పటికే ఆమె పార్ట్ చిత్రీకరణ కూడా పూర్తిచేసింది.భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ లో శ్రుతి మార్క్ పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకుంటుందని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. అలాగే మరోవైపు నటసింహ బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలో శ్రుతిహాసన్ హీరోయిన్ గా నటిస్తోంది. సీనియర్ హీరో అయిన బాలయ్య సరసన శ్రుతి కమిట్ మెంట్ ఒకింత ఆశ్చర్యానికి గురిచేసే అంశమే.ఇంకా కోలీవుడ్ లో మరో రెండు ..మూడు చిత్రాలకు సంతకం చేసింది. బాలీవుడ్ లోనూ బిజీ అయ్యే ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే హిందీలో కొన్ని సినిమాలు చేసిన సంగతి తెలిసిందే.

## సంపత్ నందితో బాలయ్య సినిమా.. నిజమేనా ?



డైరెక్టర్ సంపత్ నంది బాలయ్యతో సినిమా చేయాలని ప్రయత్నిస్తున్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. బాలయ్యకి సంపత్ నంది ఓ కథ చెప్పాడని బాలయ్య కథ నచ్చి సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తాజాగా కొత్త రూమర్స్ వినిపిస్తున్నాయి. మరి ఈ రూమర్స్ లో వాస్తవం ఎంత ఉందనేది ఇంకా క్లారిటీ లేదు. కాకపోతే నిర్మాత సి.కళ్యాణ్, బాలయ్య హీరోగా ఒక సినిమా చేయడానికి ప్రస్తుతం కసరత్తులు చేస్తున్నాడు.డైరెక్టర్ 'సంపత్ నంది'ను బాలయ్య దగ్గరకు పంపింది మిర్యాల సి.కళ్యాణే అని టాక్ నడుస్తోంది. మరి బాలయ్య ఇమేజ్ కోసం సంపత్ నంది ఎలాంటి కథ రాశాడో చూడాలి. అన్నట్టు ఆ మధ్య సంపత్ నంది రవితేజతో సినిమా చేయబోతున్నట్లు కూడా వార్తలు వచ్చాయి. అయితే, బాలయ్య అయితేనే తాను రాసుకున్న కథకు పూర్తి న్యాయం జరుగుతుందని సంపత్ నంది ఫీల్ అవుతున్నాడని తెలుస్తోంది.

# ప్రభాస్ డైరెక్టర్ కి పవన్ బంపర్ ఆఫర్ ఇచ్చారా?



ఈ శుక్రవారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన భీమ్లానాయక్ సంచలనాలు సృష్టిస్తోంది. విడుదలైన మొదటిరోజు మొదటి ఆటతో బ్లాక్ బస్టర్ హిట్ టాక్ ని సొంతం చేసుకని ప్రపంచ వ్యాప్తంగా రికార్డు స్థాయి వసూళ్లని రాబడుతోంది. ఊహించని విధంగా పవన్ హైవోల్టేజ్ పాత్రలో నటించడం తో ఈ మూవీ థియేటర్ల వద్ద ఫ్యాన్స్ జాతర మొదలైంది.'వకీల్ సామ్' వంటి స్మాషింగ్ హిట్ తరువాత పవన్ నటించిన సినిమా కావడంతో ఈ మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గని స్థాయిలో సినిమా వుండటంతో అభిమానులు ప్రేక్షకులు ఈ చిత్రానకి బ్రహ్మరథం పడుతున్నారు.మలయాళ హిట్ ఫిల్మ్ అయ్యప్పనుమ్ కోషియు ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని యంగ్ డైరెక్టర్ సాగర్ కె. చంద్ర తెరకెక్కించారు. సితార ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీని క్రియేట్ చేస్తోంది. ఈ మూవీ అందించిన సక్సెస్ జోష్ లో వున్న పవన్ కళ్యాణ్ తాజాగా మరో రీమేక్ కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారని తెలిసింది. ఇప్పటికే బ్యాక్ టు బ్యాక్ భారీ లైనప్ తో వున్న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మరో రెండు రీమేక్ లని లైన్ లో పెట్టారట.ఇప్పటికే రీమేక్ లతో వకీల్ సాబ్ భీమ్లానాయక్ వంటి బ్లాక్ బస్టర్ లని సొంతం చేసుకున్న పవన్ కళ్యాణ్ అదే ఊపులో మరో రెండు రీమేక్ లకు సై అంటూ సైరన్ ఊదేశారట. తమిళంలో సముద్రఖని నటించిన తెరకెక్కించిన చిత్రం వినోదాయ సితం. ఈ మూవీ విమర్శకుల ప్రశంసలతో పాటు భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ మూవీ రీమేక్ ని చేయడానికి పవన్ కళ్యాణ్ ఓకే చెప్పేశారు. ఇప్పటికే ఈ మూవీ రీమేక్ హక్కుల్ని సొంతం చేసుకుని దీని బాధ్యతల్ని త్రివిక్రమ్ కి అప్పగించారట.తాజాగా మరో తమిళ సినిమా రీమేక్ కి ఓకే చెప్పారని తెలిసింది. విజయ్ హీరోగా నటించిన థేరీ. ఈ మూవీని ఇప్పటికే తెలుగులో పోలీసోడు పేరుతో దిల్ రాజు డబ్బింగ్ చేసి రిలీజ్ చేశారు. ఇదే చిత్రాన్ని త్వరలో రీమేక్ చేయబోతున్నారట. ఇందులో నటించడానికి పవన్ కళ్యాణ్ ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలుస్తోంది.ఈ రీమేక్ కి ప్రభాస్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వం వహించబోతున్నాడు. సాహో తరువాత మరో చిత్రాన్ని చేయని సుజీత్ కు ఇది నిజంగా బంపర్ ఆఫరే అంటున్నాయి ఇండస్ట్రీ వర్గాలు.భారీ స్థాయిలో తెరపైకి రానున్న ఈ చిత్రాన్ని స్టార్ ప్రొడ్యూసర్ డీవీవీ దానయ్య నిర్మించబోతున్నారు. ఇప్పటికే రీమేక్ స్క్రిప్ట్ కి సంబంధించిన మార్పులు . చేర్పులు జరుగుతున్నాయని హరి హర వీరమల్లు హరీష్ శంకర్ భవదీయుడు భగత్సింగ్ చిత్రాలు పూర్తి చేసిన తరువాతే పవన్ థేరీ రీమేక్ ని సెట్స్ పైకి తీసుకురావాలనుకుంటున్నారని తెలిసింది. ఇందులో నటించే హీరోయిన్ లు ఎవరు? .. తెలుగులో పవన్ ఇమేక్ కు తగ్గట్టుగా ఎలాంటి మార్పులు చేస్తున్నారన్నది తెలియాలంటే మరి కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# ఒక్కటి తగ్గింది పూజ... మహేష్ ఫ్యాన్స్ ఫైర్



హాట్ బ్యూటీ పూజా హెగ్డే ను సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులు ట్రోల్ చేస్తున్నారు. పూజా తాజాగా చేసిన వ్యాఖ్యలు మహేష్ బాబును అగౌరవ పర్చే విధంగా ఉన్నాయంటూ వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వయసు లో పెద్ద.. స్టార్ డమ్ లో సూపర్ స్టార్ అయిన మహేష్ బాబు విషయంలో పూజా హెగ్డే వ్యవహరించిన తీరు మరియు ఉపయోగించిన భాష ఏమాత్రం సమంజసం గా లేదని మహేష్ అభిమానులు ఆమెను ట్రోల్ చేస్తున్నారు.సూపర్ స్టార్ మహేష్ బాబు ను గౌరవం లేకుండా సంబోధించింది అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ విషయమై పెద్ద ఎత్తున చర్చనీయాంశం అవుతోంది. అసలు విషయం ఏంటీ అంటే ఇటీవల ఒక సందర్భంగా పూజా హెగ్డే స్పందిస్తూ.. ప్రస్తుతం నేను మహేష్ బాబు తో ఒక సినిమాను చేస్తున్నాను.. అది గతంలోనే ప్రకటించడం జరిగిందని వ్యాఖ్యలు చేసింది.మహేష్ బాబు ను హీరోయిన్ పూజా హెగ్డే కనీసం గౌరవం లేకుండా మాట్లాడటం ఏమాత్రం బాగాలేదు. సర్ అని లేదా గారు అని మహేష్ బాబును ప్రతి ఒక్కరు గౌరవిస్తారు. కాని పూజా హెగ్డే మాత్రం ఏక వచనంతో మహేష్ తో సినిమా చేస్తున్నాను అన్నట్లుగా పేర్కొనడం ఆమె తల బిరుసుకు నిదర్శణం అన్నట్లుగా అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూజా హెగ్డే ఇండస్ట్రీలో పెద్దలను స్టార్స్ ను గౌరవించడం నేర్చుకోవాలంటూ అంతా సూచిస్తున్నారు.పూజా హెగ్డే విషయంలో ప్రస్తుతం జరుగుతున్న చర్చ పై ఆమె అభిమానులు రియాక్ట్ అవుతున్నారు. చిన్న విషయాన్ని ఎందుకు పెద్దగా చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ వారు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు. పెద్ద ఎత్తున పూజా హెగ్డేకు దక్కుతున్న అభిమానం మరియు స్టార్ డమ్ ను కొందరు తట్టుకోలేక యాంటీ ఫ్యాన్స్ ఇలా చేస్తున్నారంటూ వారు కొత్త వాదన మొదలు పెట్టారు. మొత్తానికి వ్యవహారం హాట్ టాపిక్ అయ్యింది.ఇక మహేష్ బాబు కు జోడీగా నటించబోతున్న పూజా హెగ్డే ప్రస్తుతం బాలీవుడ్ లో ఒక సినిమా లో నటిస్తుంది. తమిళంలో ఈమె విజయ్ తో కలిసి నటించిన బీస్ట్ సినిమా విడుదలకు సిద్దంగా ఉంది. మరో వైపు రాధేశ్యామ్ తో ఈమె త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. బీస్ట్ మరియు రాధేశ్యామ్ సినిమాలు రెండు కూడా సక్సెస్ అయితే ఈమె కెరీర్ మరో అయిదు సంవత్సరాల పాటు టాప్ రేంజ్ లోనే దూసుకు పోయే అవకాశం ఉంటుంది. మహేష్ బాబు.. త్రివిక్రమ్ ల కాంబోలో నటించబోతున్న పూజా హెగ్డే పాత్ర గురించి అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది.

# 'జనగణమన'కి అన్ లిమిటెడ్ బడ్జెట్ కేటాయిస్తున్నారా?




సూపర్ స్టార్ మహేష్ తో డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాధ్ జనగణమన చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించాలని భావించారు. కానీ ఈ ప్రాజెక్ట్ విషయంలో ఎందుకో ఇద్దరి మధ్య సింక్ కుదర్లేదు. మహేష్ స్టార్ డమ్ కావొచ్చు..పూరి పరాజయాలు వెనక్కి లాగిపెట్టి ఉండొచ్చు..లేక ఇతర అంశాలేవైనా రీజన్స్ అయిుండొచ్చు. దీంతో మహేష్ అనే ఆలోచనని పూరి పూర్తిగా తొలగించి ఆ ప్రాజెక్ట్ లోకి రౌడీబోయ్ విజయ్ దేవరకొండని తీసుకొచ్చారు. మహేష్ తో కాదు..విజయ్ తో కొట్టి చూపిస్తానన్న కసితో పూరి పనిచస్తున్నారు. ఇప్పటికే విజయ్ కి ఫైనల్ వెర్షన్ స్క్రిప్ట్ కూడా వినిపించి లాక్ చేసారు.లైగర్ తో పూరి-విజయ్ పాలు నీళ్లలా కలిసిపోవడం జనగణమనకి కలిసొచ్చింది. విజయ్ పాన్ ఇండియా ఇమేజ్..పూరి ట్యాలెంట్ కలిస్తే మరో సూపర్ స్టార్ ని ఎందుకు రెడీ చేయాలేనిన పూరి విజయ్ తోనే బరిలోకి దిగుతున్నారు. లైగర్ చిత్రీకరణ సమయంలో విజయ్ ని పూర్తిగా స్టడీ చేసారు పూరి. జనగణమనకి బెస్ట్ అవుట్ పుట్ ఇవ్వగల స్టార్ అని డిసైడ్ రంగంలోకి దిగుతున్నారు. ఈ చిత్రాన్ని పూరినే స్వయంగా నిర్మిస్తున్నారు. అయితే పూరి కేటాయించిన బడ్జెట్ సరిపోదు. అంతకు మించి బడ్జెట్ పెట్టి తీయాల్సిన కథ. విజువల్ గానూ అద్భుతంగా హైలైట్ చేయాలి.అందుకే ఈ ప్రాజెక్ట్ లో బాలీవుడ్ నిర్మాత కరణ్ జోహార్ ని కూడా భాగం చేస్తున్నారు. వీటన్నింటికి మించి విజయ్ ఇప్పటివరకూ భారీ బడ్జెట్ చిత్రాలేవి చేయలేదు. విజయ్ ఇమేజ్ ని బట్టి పరిమిత బడ్జెట్ లోనే నిర్మాణం జరిగింది. వాటి పలితాలు నిర్మాతల పాలిట కోట్ల కనక వర్షం కురిపించాయి. ఆ రకంగా విజయ్ క్రేజ్ ని వాడుకుని నిర్మాతలు లాభపడ్డారు తప్ప! విజయ్ ఇమేజ్ ని మించి ఖర్చు చేయలేదు. అయితే ఇప్పుడా అంశాన్ని పూరి జనగణమన తో బ్రేక్ చేస్తున్నట్లు ముంబై సోర్సెస్ చెబుతున్నాయి. స్క్రిప్ట్ సహా విజయ్ ఇమేజ్ ని అమాంతం పెంచేలా భారీ బడ్జెట్ ని కేటాయిుస్తున్నట్లు టాక్ వనిపిస్తోంది.సాధారణంగా పూరి ఓవర్ బడ్జెట్ స్క్రిప్ట్ లు ఎప్పుడూ సిద్దం చేయరు. సెట్స్ కూడా పెద్దగా ఉండవు. నేచురల్ లొకేషన్స్ లోనే షూట్ చేస్తారు. కేవలం అవసరం మేర పాటలకు మాత్రమే సెట్స్ వేస్తారు. కానీ జనగణమన విషయంలో మాత్రం వాటిని ఓవర్ కమ్ చేస్తారనే టాక్ వినిపిస్తోంది. ఏది ఏమైనా ఈ ప్రాజెక్ట్ విషయంలో పూరి చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఈ సినిమా స్క్రిప్ట్ సిద్దం చేయడానికి కూడా పూరి కొన్ని నెలలు పాటు కేటాయించారు. ఏప్రిల్ లో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుందని సమాచారం. ఇటీవలే లైగర్ చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం పూరి అండ్ టీమ్ ఆ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో నిమగ్నమైంది. సమ్మర్ కానుకగా చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకున్నారు. ఈ సినిమా సక్సెస్ కూడా చాలా కీలకం. ఈ సినిమా ఫలితం జనగణమనకి చాలా కీలకం. కొత్త ప్రాజెక్ట్ పై అంచనాలు పెంచాలన్నా? తగ్గించాలన్నా లైగర్ సీక్సెస్ కీరోల్ పోషిస్తుంది.

## ఆయన మార్క్ అద్భుతంగా అనిపిస్తోంది: కీర్తి సురేశ్



హీరో శర్వానంద్, రష్మిక మందన్న హీరోహీరోయిన్లుగా తిరుమల కిషోర్ దర్శకత్వంలో రాబోతున్న సినిమా "ఆడవాళ్లు మీకు జోహార్లు". కుష్బూ, రాధికా శరత్ కుమార్, ఊర్వశీ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని మార్చి 4వ తేదీన విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ వేడుకకు కీర్తి సురేశ్, సాయి పల్లవి ముఖ్య అతిథిలుగా వచ్చారు.కాగా ఈ సందర్భంగా కీర్తి సురేశ్ మాట్లాడుతూ.. "కిశోర్ దర్శకత్వంలోనే నా ఫస్ట్ సినిమా నేను శైలజ వచ్చింది. కిషోర్ తిరుమల గారు రాసే కథలు, వేసే పంచ్ లు చాలా బాగుంటాయి. ఎంతో అద్భుతంగా అనిపిస్తాయి. ఆయన చేసిన సినిమాలో టైటిల్ క్రెడిట్స్ లో ఆయన పేరు లేకపోయినా.. ఈ సినిమా కిశోర్ తిరుమలది అని చెప్పొచ్చు. అంతలా తనదైన మార్క్ ను చూపిస్తారు కిషోర్ తిరుమల' అని చెప్పుకొచ్చింది కీర్తి సురేశ్.






Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989